# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 46 సంచిక : 20 విజయవాడ 20-2-2014 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- ఆఫ్ఘనిస్థాన్: అమెరికా వంచనాత్మక శాంతిప్రక్రియ
- ఈశాన్య భారతపౌరులపై జాతిపర వివక్ష-దాడులు
- కాశ్మీరు సైన్యం సాగించిన 'ఎన్‌కౌంటరు' హత్యాకాండ దురాగతం వెల్లడి
- విదేశాలకు ప్రవాహంలా తరలిపోతున్న సంపద
- దేశంలో పరిశ్రమలను నిశ్శబ్దంగా కబళిస్తున్న జపాను సామ్రాజ్యవాదం
- గ్రామీణ పేదల వలసలు-యాజమాన్యాల నికృష్ట దోపిడీ, దౌర్జన్యాలు


## రైతుల పేరుతో రుణమాఫీ
## రుణాల రద్దు మాత్రం బడా పరిశ్రమాధిపతులకు!

**యు.పి.ఏ** ప్రభుత్వం 2008లో 55 వేల కోట్ల రైతుల రుణాలు రద్దుచేసి, అది తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారంచేసుకొంటూనే ఉంది. ఈ పథకం అమలు, తీరుతెన్నులను పరిశీలిస్తే అర్హులైన రైతులకన్నా, అందుకు అర్హులు కానివారే ఎక్కువమంది ఉన్నారని, అనేక అవకతవకలు, అవినీతి చోటుచేసుకొన్నాయనే విషయాలు వెల్లడైనాయి.

నేడు సేద్యం చేయటానికి పెట్టుబడి కీలకంగా మారింది. దాన్ని సమకూర్చుకోవటం చిన్న - సన్నకారు రైతాంగానికి గగనమైపోతున్నది. అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడీకి గురౌతున్నారు. వడ్డీ వ్యాపారుల బారినపడకుండా ప్రభుత్వమే బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందచేస్తుందని పాలకులు ప్రకటించడం జరిగినా, ఏ సంవత్సరం కూడా రైతులకు కేటాయించిన పంట రుణాల మొత్తాన్ని బ్యాంకులు ఇవ్వలేదు. ఇప్పటికీ 55శాతం రైతాంగానికి ముఖ్యంగా పేద, మధ్యతరగతి రైతాంగానికి బ్యాంకుల నుండి రుణాలు అందటంలేదు. ఇచ్చిన రుణాలను కూడా కాబూలీవాలా లాగా పీడించి మరీ వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వాలు అనుసరించిన, అనుసరిస్తున్న విధానాల ఫలితంగా వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో పడింది. సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల అమలు ఫలితంగా సేద్యానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు ఊహించని విధంగా పెరిగి సేద్యపు ఖర్చులు మోయలేని విధంగా పెరిగాయి. అందుకు అనుగుణంగా పంటలకు న్యాయమైన ధరలు లభించటంలేదు. దళారుల, మిల్లర్ల, సిండికేట్ వ్యాపారుల దోపిడీకి రైతాంగం గురౌతున్నారు. ఫలితంగా రైతాంగానికి సేద్యం గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు ప్రతి సంవత్సరం ఏదో ఒక రూపంలో ప్రకృతి వైపరీత్యాల వలన రైతాంగం పంటలు కోల్పోయి, అపారంగా నష్టపోవటం జరుగుతూనే ఉంది. న్యాయమైన ధర లభించక, పంటలు నష్టపోయి, రైతాంగం అప్పుల్లో కూరుకుపోతూనే ఉన్నారు. మూడెకరాలు ఉన్న రైతు రాబడి సాధారణ బ్యాంక్ గుమస్తాకన్నా తీసికట్టుగా ఉందని వెల్లడించిన, పంజాబ్ వ్యవసాయ కమీషన్ నివేదిక-రైతాంగం పరిస్థితికి అద్దం పడుతోంది. పంట రాగానే బ్యాంకు అప్పులుతీర్చే చిన్న - సన్నకారు రైతాంగం, నష్టాలపాలై అప్పుతీర్చలేని పరిస్థితుల్లో వారి ఆస్తులను బ్యాంకులు కర్కశంగా జప్తు చేస్తున్నాయి; అవమానాలకు గురిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మగౌరవం దెబ్బతిన్న రైతులు బలవంతపు మరణాలకు పాల్పడుతున్నారు.

అన్నంపెట్టే రైతాంగం అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో అప్పులు రద్దుచేయాలని రైతాంగంతోపాటు, రైతుకూలీసంఘాలు, రైతు శ్రేయస్సుకోరే ప్రజాతంత్రవాదులు ఉద్యమిస్తూనే ఉన్నారు. 1965, 1969సం॥లలో వచ్చిన తుఫాన్లు, 1977లో వచ్చిన దివిసీమ ఉప్పెన ఇతర ప్రజలతోపాటు రైతాంగాన్ని తీవ్రంగా నష్టపర్చింది. ఈ సందర్భముగా రైతాంగపు అన్నిరకాల అప్పులు రద్దుచేయాలనే ఉద్యమం ఊపందుకొంది. అనేక ఆందోళనలు కొనసాగాయి. 1977 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం మొదటిసారిగా పరిమితమైన పద్ధతిలో రైతాంగపు అప్పులు రద్దుచేసింది.

2002 నుండి ఆంధ్రరాష్ట్రంలోను, దేశంలోని అనేకప్రాంతాల్లో అనావృష్టి, అతివృష్టి, చీడపీడలు విజృంభించాయి. రైతాంగం కోలుకోని విధంగా నష్టపోయారు. గ్రామాల్లో కరువు విలయతాండవం చేసింది. గ్రామీణ పేదలతోసహా పేద, మధ్యతరగతి రైతాంగం కూడా బ్రతకుతెరువు కోసం వలసబాట పట్టారు. సేద్యం సాగని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో రైతాంగం అప్పులు రద్దుచేయాలనే డిమాండ్ తీవ్రరూపం దాల్చింది. రుణాల వసూళ్ళకు వచ్చిన అధికారులను గ్రామాల నుండి తరిమివేశారు. ఉద్యమం ఉధృతరూపం దాల్చింది.

ఎన్నికలు సమీపించినప్పుడే వ్యవసాయరంగం, రైతాంగం సమస్యలు పాలకులకు గుర్తుకువస్తాయి. కారణం - రైతాంగం ఓట్లు కీలకం కావటమే. అప్పుడు మాత్రం రైతులే దేశానికి వెన్నెముక, రైతులేనిదే రాజ్యంలేదు, పంటలకు గిట్టుబాటు ధర, సాగునీరు వంటి సమస్యలు పాలకుల నోటివెంట వస్తాయి. 2004లో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే రైతుల అప్పులు రద్దుచేస్తామని రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ప్రచారం చేసింది. అప్పుల రద్దుతోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ నాయకత్వంలోనే కేంద్రంలోనూ యు.పి.ఏ అధికార పగ్గాలు చేపట్టింది. రైతువ్యతిరేక విధానాల ఫలితంగా రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారాన్ని కోల్పోయింది.

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన 4 సంవత్సరాల వరకు అప్పుల రద్దు నినాదంగానే మిగిలిపోయింది. 2009లో సాధారణ ఎన్నికలు దగ్గరపడటంతో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు, రైతాంగాన్ని తమవైపు ఆకర్షించేందుకు 2008లో చిన్న, సన్నకారు రైతుకు 50వేల లోపు బ్యాంకు అప్పులు రద్దుచేస్తున్నట్లు ప్రకటించి బడ్జెట్ నుండి 52,275 కోట్ల రూపాయలు విడుదల చేసింది. అప్పుల రద్దు వలన 3.45 కోట్ల మంది రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుందని, ఈ ఘనత యు.పి.ఏ ప్రభుత్వానిదేనని ఘనంగా ప్రచారం చేసుకొంది.

ఆరుగాలం కష్టపడి దేశ ప్రజలకు ఆహారధాన్యాలు అందిస్తున్న రైతాంగం ఆత్మహత్యలు ఎందుకు చేసుకొంటున్నారన్న మూలాలకు వెళ్ళకుండా నామమాత్రంగా అప్పులు రద్దుచేసి దాన్నే ఘనంగా చెప్పుకొంటున్న యు.పి.ఏ ప్రభుత్వం, మొండి బకాయిల పేరుపెట్టి, బడా వ్యాపారులకు, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రుణాలను రద్దుచేస్తూ, తిరిగి వారికి అప్పులు ఇస్తున్న విషయాన్ని మరుగుపరుస్తున్నది. వీరికి రద్దు చేసిన మొత్తంలో రైతాంగానికి రద్దు చేసింది నామమాత్రమే. బ్యాంకులకు చేరిన ప్రజల సొమ్మును, మొండి బకాయిల పునర్ వ్యవస్థీకరణ పేరుతో బడాబాబులకు ప్రభుత్వం దోచిపెడుతున్నది.

ప్రభుత్వరంగంలోని చాలా బ్యాంకులు బడా పరిశ్రమాధిపతుల, కార్పొరేట్ సంస్థల అప్పులను రద్దుచేయటమో, పునర్ వ్యవస్థీకరించటమో జరుగుతుంది. గత రెండు సంవత్సరాల కాలంలో 3లక్షల కోట్ల బడా వ్యాపార వర్గాల రుణాలను బ్యాంకులు రద్దుచేశాయి. ఇందుకు సంబంధించిన సంస్థల, వ్యక్తుల పేర్లను తెలుసుకొనే అవకాశం కూడా లేకుండా చేసింది. ఇది వెల్లడైతే వారి గుట్టు బయటపడుతుందనే భయం అందుకు కారణం. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని ప్రభుత్వరంగ బ్యాంకుల నిరర్ధక ఆస్తులు పెద్దస్థాయిలో పెరిగాయి. అనేక బడా వ్యాపార సంస్థలు బ్యాంకుల ద్వారా ప్రజల సొమ్ముని దోచుకున్నాయి.

**(తరువాయి 2వ పేజీలో)**

### సంపాదకీయం

## రచ్చ చావడిలో తెలు"గోడు"

**రాష్ట్రవిభజన** సమస్యపై పాలకవర్గాల ముఠా తగవులు పార్లమెంటులో పరాకాష్టకు చేరాయి. అనుల్లంఘనీయ పవిత్రత గలదని తామే చెప్పుకుంటున్న రాజ్యాంగంమీద ప్రమాణంచేసి పదవులనలంకరించినవారే పార్లమెంటును మరోసారి రచ్చచావడిగా దిగజార్చటానికి పోటీలుపడ్డారు. తాము రూపొందించుకున్న పార్లమెంటరీ విధి, విధానాలతోపాటు కనీస మర్యాదలను కూడా పాటించకుండా తుంగలో తొక్కటంలో ఒకరిని మించి మరొకరు పోటీలు పడ్డారు. పార్టీ విధానాన్ని సమర్ధించేవారిగా, వ్యతిరేకించే వారిగా క్రమశిక్షణ అన్నది కలికానికి కూడా కన్పించని విధంగా అన్ని రాజకీయ పక్షాలూ నిట్టనిలువునా చీలాయి. అందరూ ప్రజల మనోభావాలకు ప్రతినిధులమని చెప్పుకునేవారే. ఒక్క నిముషంకూడా ప్రజల మనోభావాలూ, ఆకాంక్షలేమిటో చెప్పేమాట రాకుండానే పార్లమెంటు ఉభయసభలూ వారంరోజులపాటు సాగాయి. విభజన బిల్లు ప్రవేశపెట్టడానికి జమాజెట్టిల్లాంటి పార్లమెంటు సభ్యులతో బలప్రదర్శనచేసి సోనియాగాంధీ తన "ధృఢ" నిశ్చయాన్ని వెల్లడిచేయగా, అంతకుతగ్గని ముష్టియుద్ధాలతో విపక్షసభ్యులు ప్రజా ప్రయోజనాలు రక్షించే "హీరో"లుగా ఫోజులు పెట్టారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నత చర్చావేదికగా పదేపదే చెప్పుకునే పార్లమెంటు నిరర్ధకత్వం మరోసారి బట్టబయలైంది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు డొల్లతనం మరోసారి తేటతెల్లమైంది.

ఇంతకీ ఈ రచ్చంతా దేనికోసం? ఏ ప్రజాప్రయోజనాలను ఇది రక్షిస్తుంది? ఏ ప్రజా ఆకాంక్షలకిది అద్దంపడుతున్నది? రాష్ట్రవిభజన లేదా సమైక్యత రాష్ట్ర ప్రజల సమస్యకాదు. రాష్ట్రవిభజన జరిగినా, సమైక్యంగానే వుంచినా ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలేవీ పరిష్కారంకావనీ, పాలకవర్గ ముఠాలమధ్య అధికార పంపక తగవుల మంటల్లో ప్రజలను శలభాల్లా మాడ్చి వేస్తున్నారని "జనశక్తి" మొదటినుండీ హెచ్చరిస్తూ వస్తున్నది. "జనశక్తి" అంచనా సరైనదని ఈ పరిణామాలు మరోసారి నిరూపించాయి.

రాష్ట్రప్రజలు కోరుకుంటున్నదేమిటి? తమ పొలాలు సాగునీటితో తడిసి పంటలతో కళకళలాడాలని రైతాంగం కోరుకుంటున్నారు. తమ శ్రమకు సరిపడా వేతనం లభ్యమై, పని ప్రదేశాలలో భద్రత కలిగివుండి గౌరవప్రద జీవనం గడపాలని కార్మికులు కోరుకుంటున్నారు. వ్యవసాయం వెనుకబడి ఉపవృత్తులు నాశనమై కడుపు చేతపట్టుకుని వలసలు పోతున్న గ్రామీణ పేదలు దుర్భరజీవన, పనిపరిస్థితులు మారాలని కోరుకుంటున్నారు. భవిష్యత్తుపై ఆశలన్నీ కళ్లల్లో పెట్టుకుని డిగ్రీలు చేతపట్టుకుని జీవన సమరంలోకి అడుగుపెట్టిన యువత తమ శక్తియుక్తులు వినియోగించగల ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని కోరుకుంటున్నారు. మానవులుగా ఉనికికి అవసరమైన కనీస అవసరాలు తీరాలని ఆదివాసీ జనులు కోరుకుంటున్నారు. సమానత్వంతో, ఆత్మగౌరవంతో తలెత్తుకు జీవించాలని మహిళలూ దళితులూ కోరుకుంటున్నారు.

తెలుగు ప్రజల ఈ ప్రజాస్వామిక ఆకాంక్షలూ, డిమాండ్లను పార్లమెంటు, శాసనసభ లోపలా, వెలుపలా విభజన సమస్యపై సాగుతున్న, సాగిన పాలకవర్గ పార్టీల చర్చ ముందుకు తెచ్చిన పాపాన పోలేదు. ఈ సమస్యలకు పొరుగువారే కారణమన్న రెచ్చగొట్టుడూ, విభజనే అన్ని సమస్యలకు పరిష్కారమని ఒకవైపునా; విభజన జరిగితే సమస్యలు మరింత తీవ్రమౌతాయన్న రెచ్చగొట్టుడు, సమైక్యంగావుంటేనే అన్ని సమస్యలూ పరిష్కారమౌతాయన్న ఆశల పందిళ్లు మరోవైపునా పాలకవర్గ పార్టీలు సాగించాయితప్ప ప్రజలెదుర్కొంటున్న మౌలికసమస్యల పరిష్కారానికీ, తమ పరిమితుల్లోనైనా ఒక కార్యక్రమాన్నీ ఏ ఒక్కరూ ప్రతిపాదించలేదు. పోనీ తక్షణ సమస్యలన్నా తీర్చేందుకు పూనుకోలేదు.

పైపెచ్చు విభజనపై భావోద్వేగాలను పెంచి ప్రజల సమస్యలను అసలు అజండాలోకి రాకుండా కలిసికట్టుగా వ్యవహరించారు. అందరూ రైతు బాంధవులే. వేలాది రైతాంగం చేతివృత్తులవారు ఆత్మహత్యల పాలబడితే బయట ఒకరిపై ఒకరు బురదజల్లుకోవటంతప్ప, ఆత్మహత్యలకు కారణాలూ, పరిష్కారాలు తెలుసుకునేందుకు పదేళ్లలో ఒక్కరోజుకూడా శాసనసభకు తీరిక దొరకలేదు. ప్రజల కనీస అవసరాలైన విద్యా, వైద్యాలను ప్రైవేటు రంగానికి లాభాలపంటగా మార్చిన విధానాలనే ప్రజాసంక్షేమ చర్యలుగా చూపెట్టుకున్నారు. సంకుచిత దోపిడీ ప్రయోజనాలు ఈడేర్చుకునేందుకు విభజన చదరంగంలో ప్రజలనూ, ప్రజాప్రయోజనాలనూ పావులుగా వాడుకుంటున్నారు.

వీరి సమన్వయ నినాదం దీనికొక ఉదాహరణ. హైద్రాబాదులాంటి మరో నగరాన్ని నిర్మించి యిస్తే, సమన్యాయం జరుగుతుందట! కొత్త రాజధానిలో ఒక ఐఐటి, ఐఐఎం, ఐమెస్‌లాంటి విద్యాసంస్థలు స్థాపించాలట. ఇవన్నీ విద్యార్థులందరూ అఖిల భారత స్థాయిలో పోటీపడి సీట్లు పొందవలసినవే. ఆంధ్రప్రాంత విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పడే సౌకర్యంలేదు. అయినా ఇదేదో ఆంధ్రవిద్యార్థుల కోసమన్నట్లు చిత్రిస్తున్నారు. వీటి నిర్మాణానికి వెచ్చించే వందలకోట్ల రూపాయలను శాసనకర్తలుగా రూపుదాల్చిన కాంట్రాక్టర్లు దండు కోవటమే దీని పరమార్థం. జిల్లా కేంద్రానికి అందుబాటులో వుండేందుకు ఖమ్మంజిల్లాలో కలిపిన భద్రాచలాన్ని ఆంధ్రకు కేటాయిస్తే విభజన సమస్యలన్నీ పరిష్కారమౌతాయట. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిఅయి రాష్ట్రం సస్యశ్యామలమవుతుందట. వాస్తవమేమిటి? ఒక్క ఎకరానికి కూడా కొత్తగా సాగునీరివ్వని ప్రాజెక్టు యిది. దశాబ్దం గడిచినా ఇప్పటికి తవ్విన కాలువలు ఒకవైపున పూడిపోతుండగా, డ్యాము పునాదులు కూడా నిర్మాణం కాని ప్రాజెక్టు యిది. దీని ఖర్చు అంచనాలు మాత్రం తడిసి మోపెడయ్యాయి. అవినీతినేతల, వారి ఆశ్రితుల జేబులు నింపుతున్న ప్రాజెక్టు ఇది.

**(తరువాయి 3వ పేజీలో)**

# పశ్చిమ బెంగాల్

## ఆదివాసీ మహిళపై సామూహిక అత్యాచారాన్ని ఖండించండి!

**బీర్భుమ్‌జిల్లా** లాభ్‌పూర్ బ్లాక్‌లోని మహోదరి పంచాయితికి చెందిన ఆదివాసి గ్రామం సుబాల్‌పూర్‌లో ఆదివాసి మహిళపై సాగిన సామూహిక బలాత్కారం, అత్యంత పాశవికమైన సంఘటన. గిరిజనేతర తాపీమేస్త్రీకి అతని వద్ద పనిచేసే ఆదివాసి మహిళతో వున్న లైంగిక సంబంధాన్ని ఆదివాసీ కోర్టు విచారించిందని మొదటవచ్చిన వార్తలు తెలిపాయి. ఇరువురికి చెరో పాతికవేల రూపాయిలు జరిమానా విధించినట్లుగా, తాపీమేస్త్రీ జరిమానా చెల్లించగా అతన్ని విడిచిపెట్టినట్లు; ఆదివాసీ మహిళ జరిమానా చెల్లించనందున, ఆదివాసీ పంచాయతీ యొక్క ఆదేశంతో ఆమెపై సామూహిక బలాత్కారం జరిగినట్లు ఈ వార్తలు తెలిపాయి.

అయితే క్రమంగా పూర్తి సమాచారం వెలుగులోకి వచ్చింది. అది ఆదివాసుల సాంప్రదాయక పంచాయతి కాదని తేలింది. దీనిలో అనేకమంది గిరిజనేతరులు, వివిధ పాలకపార్టీల నాయకులు పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో మహిళల భద్రత ఎంత హీనస్థాయికి చేరిందో ఈ ఘటన తెలుపుతున్నది. పార్క్‌స్ట్రీట్‌లోనూ, కత్వాలోనూ బలాత్కార ఘటనలు జరిగినప్పుడు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అలాంటి ఘటన జరగలేదని ఖండించారు. తన ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసేందుకే ఈ "కథనాలు" వెలువడ్డాయన్నారు. ఆ తర్వాత కూడా బలాత్కర ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కాందునీలో ఒక విద్యార్థినిని బలాత్కారానికి గురిచేసి హత్య కావించారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవలసిందిపోయి, బలాత్కార ఘటనను ఖండిస్తున్న వారిపై దుష్ప్రచారాన్ని మొదలుపెట్టింది. మరోప్రక్కన, బాధిత కుటుంబీకులను డబ్బాశపెట్టి కొనివేయటానికి ప్రయత్నించింది. మధ్యంగ్రామ్‌లో ఒక బాలికను బలాత్కారానికి గురిచేసి, బయటకు చెబితే చంపుతామని బెదిరించారు. ఆ బాలిక కుటుంబం ఊరు విడిచివెళ్ళిపోయినా వేధించారు. చివరకు ఆ బాలికను తగులబెట్టారు. నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునే బదులుగా పోలీసులు ఆ బాలిక శవాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలిక శవంతో తలపెట్టిన నిరసన ప్రదర్శనను జరగకుండా ఆపివేశారు. లాభ్‌పూర్ బలాత్కార ఘటన, పరిస్థితిలో మార్పు తెచ్చింది. తృణమూల్ కాంగ్రెసుకు చెందిన స్థానిక నాయకులు దీనిలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు గుంజేందుకు పూనుకున్నారు. అది పూర్తిగా సాగకపోవటంతో, ఆదివాసీ మహిళను సామూహిక బలాత్కారానికి గురిచేశారు. ఇప్పుడు మొత్తం ఘటనను దాచిపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట అది ఆదివాసీల సాంప్రదాయక కోర్టు అన్నారు. ఇప్పుడు అలాంటి ఘటనే జరగలేదంటూ బలవంతంగా గ్రామస్తులతో చెప్పిస్తున్నారు.

పాలకపార్టీ సాగిస్తున్న భయోత్పాత పాలనను ఇది తెలుపుతున్నది. పార్టీ కోసమంటూ సామాన్యులనుండి బలవంతపు వసూళ్లు సాగిస్తున్నారు. ఇవ్వనిరాకరిస్తే, బాలికల బలాత్కారంతో సహా తీవ్ర దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తున్నది. దీనిని వ్యతిరేకించే ప్రయత్నాలకు ప్రభుత్వ వ్యతిరేక కుట్రగా ముద్రవేస్తున్నారు.

పశ్చిమబెంగాలు ప్రజలు తాము తేదలచిన "మార్పు" అసలు రూపాన్ని నేడు చూస్తున్నారు. బాలికల బలాత్కారం, బలవంతపు వసూళ్లు, పాలకపార్టీ భయోత్పాత చర్యలూ నిత్యకృత్యంగా అనుసరించే వ్యక్తులను ఈ "మార్పు" అధికారంలోకి తీసుకొచ్చింది. దీనికి వ్యతిరేకంగా ప్రజలు నెమ్మదిగా, నిలకడగా సమీకృతులవుతున్నారు.

మహిళలపై ఈ అత్యాచారాలను ఎలుగెత్తి ఖండించమని అఖిల భారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ ప్రజలందరికీ పిలుపునిస్తున్నది. పశ్చిమబెంగాల్‌లో పాలకపార్టీ సాగిస్తున్న భయోత్పాత పాలనను ఖండించి ఎదుర్కొనమని పిలుపునిస్తున్నది.

ఈ పాశవిక ఘటనను వ్యతిరేకిస్తూ ధృఢంగా నిలచినందుకు ఏఐకెఎంకెఎస్ బీర్భూం జిల్లా యూనిట్‌నూ, ప్రజాస్వామిక శక్తులందరినీ అభినందిస్తున్నది.

**బోల్‌పూర్**
**31-1-2014**

**సుబోధ్‌మిత్రా**
**కన్వీనర్**
**ఏఐకెఎంకెఎస్**

**యస్.ఝూన్సీ**
**కో-కన్వీనర్**
**ఏఐకెఎంకెఎస్**

# కామ్రేడ్ సజ్జా నారాయణరావుకు జోహార్లు

**తొలితరం** కమ్యూనిస్టు కామ్రేడ్ సజ్జా నారాయణరావు (90 సం॥లు) 12-1-14న కృష్ణాజిల్లా నాగాయలంకలో మృతిచెందారు. పేద రైతు కుటుంబంలో జన్మించిన కా॥ నారాయణరావు, ఫ్యూడల్ వ్యవస్థ రద్దుకోసం, చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా సాగిన పోరాట స్ఫూర్తితో, అమరులు కా॥ చల్లపల్లి నారాయణరావు త్యాగపూరిత ఉద్యమకృషి ప్రభావంతో కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షితులై తొలుత కొంతకాలం కార్యకర్తగా పనిచేశారు. నిరంతర శ్రమజీవిగా వున్న కా॥ నారాయణరావు కమ్యూనిజం అజేయమనే ధృడవిశ్వాసాన్ని కడదాకా కలిగివున్నారు. ఈ లక్ష్యంతో కృషిసాగిస్తూన్న ఉద్యమాలకు తనవంతు సహాయ సహకారాలందించేవారు.

కామ్రేడ్ నారాయణరావు మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) కృష్ణాజిల్లా శాఖ సంతాపం వ్యక్తంచేస్తూ, వారికి జోహార్లర్పిస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తోంది.

కా॥ సజ్జా నారాయణరావు సంస్మరణసభ 26-1-14న కమ్యూనిస్టు అభిమాని కా॥ నిమ్మగడ్డ శేషగిరి అధ్యక్షతన జరిగింది. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కొప్పుల కోటయ్య, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ, ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కా॥ రవిబాబు, జనసాహితి ప్రధాన కార్యదర్శి కా॥ దివికుమార్, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ సోని, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) నాయకులు కా॥ తలశిల లీలామనోహర్ మరియు వివిధ ప్రజాసంఘాల నాయకులు కా॥ నారాయణరావుకు జోహార్లర్పించారు.

## రైతులపేరుతో... (మొదటిపేజీ తరువాయి)

అత్యున్నతస్థాయి రేంటింగ్ ఏజన్సీ 'క్రిసిల్' సమాచారం ప్రకారం 2013-14 ఆర్థిక సంవత్సరం మార్చిలోనే బ్యాంక్‌ల నిరర్థక ఆస్తులు ఒక ట్రిలియన్ (10వేల కోట్లు) నుండి 4 ట్రిలియన్ రూపాయలకు పెరిగే అవకాశం ఉంది. 2001నాటి బ్యాంక్‌ల నిరర్థక అస్తులు (మొండి బకాయిలు)తో పోలిస్తే ఇది చాలా పెద్దది. ఈ నిరర్థకఆస్తులన్నీ బడావ్యాపారవర్గాలు ఎగనామం పెట్టినవే. ఈ నిరర్థక ఆస్తులు గత సంవత్సరం మార్చిలో 3.3%కాగా జూన్ చివరికి 3.7 శాతానికి పెరిగాయి. 2014 నాటికి ఇవి 4.4%కి పెరగ వచ్చని క్రిసిల్ పేర్కొంది. 2011 మార్చినాటికి 71,080 కోట్లుగా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంక్‌ల నిరర్థక (మొండిబకాయిలు) ఆస్తులు 1.55లక్షల కోట్లకు పెరిగాయి. 2013 సెప్టెంబర్ నాటికి 40 లిస్టెడ్ బ్యాంక్‌ల స్థూల మొండిబకాయిలు 2.22 లక్షల కోట్లకు చేరాయని ఆర్థికమంత్రి చిదంబరం రాజ్యసభలో లిఖిత పూర్వకంగా చెప్పారు. ఏడాది కాలంలో 37% ఈ నిరర్థక ఆస్తులు పెరిగాయంటే బ్యాంక్‌లు ఎవరి ప్రయోజనాలకోసం పనిచేస్తున్నాయో అర్థమౌతుంది. ఈ నిరర్థకఆస్తుల్లో ఎక్కువ భాగం 30మంది పెద్దస్థాయి రుణ ఎగవేతదారుల నుండే జరిగిందని చెప్పిన ఆర్థికమంత్రి, వారి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఈ 30మంది బడా ఎగవేతదారులు ఎవరన్నది, వారి వ్యాపార లావాదేవీలు ఏమిటన్నది బయటపెట్టాల్సి ఉంది. గత 18 నెలల కాలంలో ప్రభుత్వరంగ నిరర్థక ఆస్తులు గణనీయంగా పెరిగిపోవటంపై ఆర్థిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్‌కమిటీ కూడా తీవ్రఆందోళన వ్యక్తం చేసింది.

బడా వ్యాపార వర్గాలే బ్యాంకుల రుణాలను ఎగ్గొడుతున్నారని చెబుతున్న ఆర్థికమంత్రి వాటిని రాబట్టేందుకు చర్యలు తీసుకోకపోగా, వాటిని రద్దు చేసేందుకు బ్యాంకులకు అవకాశం కల్పిస్తున్నాడు. ఎప్పుడూలేని విధంగా వసూలుకాని రుణాలను లెక్కిస్తున్నారు. చివరికి బడాఎగవేతదారుల అప్పు లన్నింటినీ రద్దుచేస్తున్నారు. బ్యాంకులు, రుణ ఎగవేతదారుల బేలన్స్‌షీట్లను తారుమారు చేయటానికి కార్పొరేట్ రుణ పునర్ నిర్మాణం (సిడిఆర్)ని ఉపయోగిస్తున్నారు. దాన్ని తరచూ దుర్వినియోగ పరుస్తున్నారు. ఫిక్కీ (భారత పరిశ్రమల వాణిజ్య సంఘాల సమాఖ్య) నివేదిక ప్రకారం సిడిఆర్ ప్రక్రియ క్రింద 2.5 ట్రిలియన్ మొత్తానికి రుణాలను బ్యాంకులు తిరిగి లెక్కిస్తున్నాయి. అలా లెక్కించడమంటే వాటిని రద్దుచేయటమే. ఇందులో ఎక్కువభాగం కొద్దినెలల క్రితం యిచ్చినవే. గత సంవత్సరం 75వేల కోట్లమేర రుణాలను బ్యాంకులు పునర్ వ్యవస్థీకరించాయి. 2013 ఏప్రియల్-జూన్ మధ్య కాలంలో ప్రభుత్వ బ్యాంకులు 20 కోట్లకు 12 కంపెనీల మొత్తాలను పునర్ వ్యవస్థీకరించాయి. ఇందుకు ఎన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు సరైన పద్ధతులను అనుసరించాయి; కొన్నింటినే మెరిట్ పద్ధతిన ఎలా ఆమోదించి వాటి అప్పులను రద్దు చేసిందీ తెలియదని, రద్దైన వాటిల్లో ఎక్కువభాగం పెద్దమొత్తాలేనని రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీగవర్నర్ స్వయంగా ప్రకటించారు. ఇందులో అనేక అవకతవకలు జరిగాని పేర్కొన్నారు. ఆయన ఇటీవల బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేట్లకు యిచ్చిన మొండిబకాయిలు రద్దుచేయటం ద్వారా లక్ష కోట్లు బ్యాంకులు త్యాగం చేసిన విధానాన్ని వివరించారు. వ్యవసాయ రుణాలను మాఫీచేసినప్పుడు బడా పరిశ్రమాధి పతులు, వారి అత్యున్నతస్థాయి సంస్థలు తీవ్రవిమర్శలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. బ్యాంక్ దోపిడీలకన్నా, రుణాల ఎగవేత రద్దుకి పాల్పడే వారిది అత్యంత దారుణంగా ఉందని చెప్పారు. కింగ్‌ఫిషర్, డక్కన్ క్రానికల్ యాజమాన్యం 28 బ్యాంక్‌ల, ఆర్థికసంస్థల నుండి తీసుకొన్న 4.300 కోట్ల రూపాయల రుణాలు చెల్లించకపోయినా, ఎటువంటి చర్యలు తీసుకోకుండా తిరిగి రుణాలు ఇస్తున్నారు. చెరకు ఫ్యాక్టరీల బడా యాజమాన్య వర్గం నష్టాల్లో ఉన్నారని, వడ్డీలేకుండా ప్రభుత్వమే బ్యాంక్‌ల నుండి 6,700 కోట్లు ఇప్పించటం జరిగింది. వీటిని గమనిస్తే బ్యాంక్‌లు ఎవరిసేవలో ఉన్నాయో అర్థమౌతుంది.

బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ సంస్థలకు బ్యాంక్‌ల ద్వారా ప్రజల డబ్బులను కట్టబెట్టటమే కాకుండా, రైతుల రుణమాఫీకి కేటాయించిన దాన్ని కూడా అందుకు అర్హులు కానివారికే దోచిపెడుతున్నది.

ఐదు ఎకరాలలో వున్న చిన్న, సన్నకారు రైతుల 50వేల లోపు బ్యాంక్ అప్పులను రద్దు చేస్తున్నట్లు 2008లో ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా ఇంకా 60 లక్షల మంది ఇతర రైతులు మూడు వంతులు బకాయిలు చెల్లిస్తే మిగతాది రద్దుచేస్తామని ప్రకటించింది. ఈ రద్దు జరగక ముందు బ్యాంకుల వేధింపులు భరించలేక ఆస్తులు అమ్మి, అప్పు సొప్పు చేసి అప్పులు కట్టిన చిన్న, సన్నకారు రైతులకు మాత్రం అప్పుల రద్దు వర్తించదు. వారు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతూ ఉండాల్సిందే. యు.పి.ఏ చైర్మన్ సోనియాగాంధీ, ప్రధాని రైతుల రుణాల రద్దు విప్లవాత్మక చర్యగా అభివర్ణించటమే తప్ప, అది సక్రమంగా అమలు జరిగే విధానాలు అమలు జరపలేదు. పథకం ప్రారంభం నుండే అనేక అవకతవకలు, అక్రమాలు కొనసాగాయి. ఈ విషయాన్ని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పేర్కొంది. 2011 నుండి 2012 మార్చి వరకు 25 రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో సర్వే జరిపి 90,578 మంది రైతుల ఖాతాలపై ఆరా తీసి ఈ పరిశీలనలో అనేక అక్రమాలు జరిగాయని 'కాగ్' వెల్లడించింది. సర్వే జరిపిన రైతుల ఖాతాల్లో 20వేలు అక్రమమైనవని, రైతుల అర్హత నిర్ణయం విషయంలో అనేక అక్రమాలు జరిగాయని 20లక్షల మంది తప్పుడు ధృవపత్రాలు చూపి రుణమాఫీ పొందారని, అర్హులైన 13.46 శాతం మంది రుణఅర్హత పొందలేదని, అనేక సూక్ష్మ రుణ సంస్థలు(మైక్రోఫైనాన్స్) రుణమాఫీ క్రింద ప్రయోజనం పొందాయని, గ్రామాల్లో రుణ మాఫీ పొందినవారిలో 55% భూస్వాములే ఉన్నారని వెల్లడైంది. రికార్డుల్లో తప్పుడు లెక్కతో పెద్దమొత్తంలో గోల్‌మాల్ జరిగింది. చాలా చోట్ల రుణమాఫీ డబ్బు రైతులకు బదులు మైక్రో ఫైనాన్స్ సంస్థలకు చేరింది.

రుణమాఫీ పొందిన వారికి కూడా అందుకు సంబంధించిన పత్రాలు ఇవ్వటంలోనూ అవినీతి రాజ్యమేలింది. తమను సంతోషపెడితేనే రుణమాఫీ పత్రాలు అధికారులు ఇవ్వటం జరుగుతున్నది. ఇప్పటికీ రుణమాఫీ పొందిన 34% మందికి అందుకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇవ్వకపోవటమే అందుకు నిదర్శనం.

90లక్షల ఖాతాల పరిశీలనలోనే ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగితే, మొత్తం ఖాతాలను పరిశీలిస్తే ఎంతటి అవినీతి, అక్రమాలు బయట పెడతాయో?! ఇంకా 'కాగ్' ఆ దిశగా పయనించక పోవటంలో మర్మమేమిటిఅన్న ప్రశ్న మిగులుతుంది.

పాలకులు ఏ చట్టాలు చేసినా, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఆర్థికపరమైన నిర్ణయాలు చేసినా, తాము ప్రాతినిధ్యం వహించే వర్గాల ప్రయోజనం ఇమిడి ఉంటుంది. దేశ పాలకులు భూస్వాముల, బడా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీ ప్రయోజనాలను పరిరక్షిస్తున్నారు. అందుకు అనుగుణమైన విధానాలు అమలు పరుస్తున్నారు. బడా పరిశ్రమదారులకు బ్యాంక్‌లు యిచ్చిన రుణాలను మొండి బకాయిల పేరుతో, నిరర్థక ఆస్తులుగా ప్రకటించి రద్దుచేయటం అందులో భాగమే. దీన్ని కప్పిపెడుతూ, రైతుల రుణాలను రద్దుచేయటం, దేశ ఆర్థిక అభివృద్ధికి ఆటంకంగాను, భారంగా చెబుతూనే, రైతుల ప్రయోజనం కోసం అలాంటి భారాన్ని ప్రభుత్వం సేకరిస్తుందని ప్రచారంచేసుకొంటున్నారు. అమెరికా -తూర్పుయూరప్ దేశాల్లో రైతులకు (భూకామందులకు) ఇస్తున్న రాయితీలు, రుణాలను పరిశీలిస్తే మన రైతాంగం యొక్క రుణ మాఫీ సముద్రంలో నీటిబొట్టు లాంటిది. దీన్ని కొండంతలుగా పాలకులు ప్రచారం చేయటం రైతాంగాన్ని, ప్రజలను మభ్యపెట్టటమే.

ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు తగ్గించి, సబ్సిడీలు పెంచి, ఉత్పత్తి ఖర్చులు తగ్గించి, సాగునీటి సౌకర్యంతోపాటు, ప్రకృతి వైపరీత్యాలద్వారా సంభవించే నష్టాలను తగ్గించే విధానాలు చేపట్టి, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటిస్తే ఏ రైతూ బ్యాంకులకు అప్పుదారుడిగా ఉండడు. పాలకులకు అటువంటి విధానాలు అవలంబించకపోవటం వలనే అప్పులపాలైన రైతులు బ్యాంకురుణాలు చెల్లించలేక పోతున్నారు.

పాలకులు అనుసరిస్తున్న విధానాలను ప్రజలు గ్రహించాలి. బడాపరిశ్రమలు, సంపన్నవర్గాలు బ్యాంకులకు చెల్లించవలసిన లక్షలాది కోట్లను ప్రభుత్వం వెంటనే వారి నుండి వసూలు చేయాలని, అవసరమైతే వారి ఆస్తులు జప్తుచేయాలని, నష్టాల పాలైన రైతుల అప్పులను, పేదలకు యిచ్చిన కొద్దిపాటి రుణాలను రద్దుచేయాలని, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించాలని రైతాంగం, గ్రామీణ పట్టణ పేదలు పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ✶

# వంటగ్యాస్ ధర పెంపుకు నిరసన

**అనంతపురం, 2-1-14 :**

స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఓ కార్యాలయం వద్ద నుండి మహిళలు ఖాళీ సిలిండర్లను మోసుకుంటూ, వంటగ్యాసు ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ టవర్ క్లాక్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రదర్శకులనుద్దేశించి స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ భూదేవి మాట్లాడుతూ వంటగ్యాస్ ధరల పెంపుద్వారా 2,470 కోట్ల భారాన్ని మరోసారి పేదవర్గాల ప్రజలపై ప్రభుత్వం మోపిందని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్యుత్తు ఛార్జీలు, ఇంటిపన్నులు, కూరగాయల ధరల పెరుగుదల, రవాణా ఛార్జీల పెరుగుదలలతోపాటు మరోవైపున ఉపాధి అవకాశాలు తగ్గిపోతూండటంతో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు కడుదుర్భరంగా మారాయని, పెరిగిన నిత్యావసర ధరలతోపాటు వంటగ్యాసు ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఇంకా, ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కా॥ రమాదేవి, కా॥ సరోజ, మల్లీశ్వరి(స్టాలిన్ నగర్), విమల(రజకనగర్) మరియు ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ సి.ఆర్.ఖాన్, ఎన్‌వైయస్ నాయకులు కా॥ బాలు, కా॥ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**బందరు, 20-1-14 :**

వంటగ్యాస్ ధరలను పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ స్త్రీ విముక్తి సంఘటన, ఏఐఎఫ్‌టియు(న్యూ)ల అధ్వర్యంలో స్థానిక బస్టాండు సెంటర్ నుండి కోనేరు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ వై. సోని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేటీకరణలో భాగంగా సహజవనరులైన చమురు వాయు నిక్షేపాలను సామ్రాజ్యవాద కంపెనీలకు, బడా కార్పొరేటు సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతున్నాయన్నారు.

(తరువాయి 7వ పేజీలో)

# ఆఫ్ఘనిస్తాన్

## అమెరికా వంచనాత్మక శాంతి ప్రక్రియ

**ఆఫ్ఘనిస్తాన్** నుండి అమెరికా సైన్యాల ఉపసంహరణ, శాంతి స్థాపనల పేరిట ఏకకాలంలో రెండు రకాల ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే రెండు రకాల ప్రయత్నాలూ సమస్యలమయమేకాక మోసపూరిత స్వభావాన్ని కలిగివున్నాయి.

మొదటిది : అమెరికా సామ్రాజ్యవాదానికీ కర్జాయి సారధ్యంలోని ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి మధ్య కుదిరిన ద్విపక్ష భద్రతా ఒప్పందంపై కర్జాయి ఇంకా సంతకం చేయాల్సి వుంది. ఈ ఒప్పందం ప్రకారం ఆఫ్ఘనిస్తాన్‌లో వున్న అమెరికా సైన్యాన్ని 2014 ఏప్రిల్ నాటికి 60వేలకు తగ్గించాలి; 2014 సెప్టెంబరు నాటికి 20వేలకు తగ్గించాలి. ఆ తర్వాత 15వేలకు తగ్గించాలి. ఈ తగ్గించిన సైన్యం ఆఫ్ఘనిస్తాన్‌లో "మిగిలిపోయిన మద్దతు కర్తవ్యాలు" నిర్వహించాలని చెప్పుకుంటున్నారు. దీని అర్థం "టెర్రరిజం వ్యతిరేక" కర్తవ్యాలను అమెరికా స్వయంగా నిర్వహించటం; అలాగే ఆఫ్ఘనిస్తాన్ సైన్యానికి తర్ఫీదునివ్వటం. ఆఫ్ఘనిస్తాన్‌లో 9 శాశ్వత సైనిక స్థావరాలను అమెరికా కలిగివుండటాన్ని ఈ ఒప్పందం అనుమతిస్తుంది. అసాధారణ పరిస్థితుల్లో అమెరికా సైన్యాలు ఆఫ్ఘనీయుల ఇళ్ళపై దాడి చేయవచ్చునని కూడా ఒప్పందం పేర్కొంది. మానవ హక్కుల ఉల్లంఘనలకు, యుద్ధనేరాలకు అమెరికా సైన్యం తనకు జవాబుదారీగా వుండాలని కర్జాయి ప్రభుత్వం అడగలేదు. 2017 వరకూ అంతర్జాతీయ దాతల కూటమి యిచ్చే ద్రవ్యసహాయాన్ని బట్టి ఆఫ్ఘన్ భద్రతా దళాల సంఖ్యను 3,52,000కు పెంచుతారు. ఈ ఒప్పందంపై కర్జాయి సంతకం చేసేదాన్ని బట్టే అంతర్జాతీయ దాతల కూటమి అందించే నిధులుంటాయి. దీని తర్వాతే మరో ప్రత్యేక "దళాల స్థాయి ఒప్పందాన్ని" ఆఫ్ఘనిస్తాన్‌తో నాటో కూటమి చేసుకుంటుంది.

ఏమైనా, ద్విపక్ష భద్రతా ఒప్పందంపై సంతకం చేసే ప్రక్రియను ఆలస్యంచేసే మార్గాన్ని కర్జాయి ఎంచుకున్నాడు. ఒప్పందాన్ని పార్లమెంటుకు సమర్పించే ముందుగా కర్జాయి లోయా జిర్గా(మహాశాసనసభ)ను సమావేశపరచి దానిముందు ఒప్పందాన్నుంచాడు. ఈ ఒప్పందాన్ని లోయాజిర్గా ఆమోదించింది. 2013 డిసెంబరు నాటికి ఒప్పందంపై సంతకం చేయమని కర్జాయికి చెప్పింది. ఆఫ్ఘన్ పౌరులూ, ఇళ్ళపై అమెరికా సాగిస్తున్న విచక్షణారహిత సాయుధ దాడులను ఆపిన తర్వాతే 2014 ఏప్రిల్‌లో సంతకం చేస్తానని కర్జాయి పట్టుపట్టాడు. "అమెరికా నన్ను నమ్మటంలేదు. నేను అమెరికాను నమ్మను" అని కర్జాయి అన్నాడు.

దీనిని చూసి అమెరికాకూ, కర్జాయికి మధ్య మౌలిక విభేదాలున్నాయని భావించలేము. ఇన్నేళ్ళుగా అమెరికా చేతిలో పనిముట్టుగా ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధంలో అమెరికాకు కర్జాయి సేవచేస్తూ వచ్చాడన్నది అందరికీ తెలిసిన విషయమే. అమెరికా సామ్రాజ్యవాదానికి కర్జాయికి మధ్య చర్చలూ, అంగీకారాల ఫలితంగానే ద్విపక్ష భద్రతా ఒప్పందం కుదిరిందన్నది బహిరంగ రహస్యమే. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైనిక కార్యకలాపాలు నిర్వహించడానికీ, ఆఫ్ఘనిస్తాన్ "జాతీయ ఆత్మరక్షణా దళాలకు" శిక్షణ, తర్ఫీదు, సైనిక నిర్దేశాలను అమెరికా యివ్వటానికి ఒప్పందం అంగీకరించింది. అంటే ఒక దురాక్రమణ దారుడికీ, అతనికి అణిగిమణిగి ఉండే ప్రభుత్వానికీ మధ్య కుదిరిన ఒప్పందమిది. ఎలాంటి జోక్యమూ, ఆక్రమణా, ఆధిపత్యమూలేకుండా దురాక్రమణదారుడు వెళ్ళిపోవాలని ఆఫ్ఘన్ ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలతో ఈ ఒప్పందానికి ఎలాంటి సంబంధమూ లేదు.

కర్జాయి ప్రధాన సమస్య అతని ఉనికి. ఆయన అధ్యక్ష పదవీకాలం 2014 సెప్టెంబరుతో ముగుస్తుంది. అమెరికా సామ్రాజ్యవాదులు తనను చెత్తబుట్టలో పడవేసి, తమకు నచ్చిన మరో అభ్యర్థిని అధ్యక్షుడిగా చేస్తారన్నది అతని భయం. తను అధ్యక్షుడిగా కొనసాగించేందుకు అమెరికాను అంగీకరింపచేసే సాధనంగా కొంత సమయం పాటు సంతకం చెయ్యకుండా బేరసారాలాడాలన్నదే కర్జాయి ప్రయత్నం. ఒప్పందంపై కర్జాయి సంతకం అవసరంలేదనీ, ప్రభుత్వం తరపున ఏ అధికారి సంతకం చేసినా సరిపోతుందను వాదనలు వాషింగ్టన్ అధికార సౌధాలలో సాగుతున్నాయన్న వార్తలూ వెలువడు తున్నాయి. ఇది అమెరికాకూ కర్జాయికి మధ్య ఘర్షణను తెలుపుతుంది. అంతేగాక, కర్జాయిని అమెరికా పట్టించుకోవటంలేదనీ, అతని వాదనకు అసలు విలువే ఇవ్వటంలేదన్న వాస్తవాన్ని తెలుపుతున్నది.

రెండవది : తనతో చర్చల ప్రక్రియలోనికి తాలిబన్లను ఆకర్షించే ప్రయత్నాలను అమెరికా ముమ్మరంగా చేస్తున్నది. ఆఫ్ఘనిస్తాన్ సహజ వనరులను అమెరికా దోచుకునేందుకు తోడ్పడే, ఈ ప్రాంతంలో అమెరికా వ్యూహాత్మక పథకాల అమలు కొనసాగింపుకు సహాయపడే, తాలిబన్లు భాగస్వాములుగా లేదా వారే సాయకులుగా ఉండే ప్రభుత్వాన్ని ఆఫ్ఘనిస్తాన్ ప్రజల నెత్తిన పెట్టాలన్న లక్ష్యంతో అమెరికా వ్యవహరిస్తున్నది. 2013 జూన్‌లో అమెరికా అధ్యక్షుడు ఒబామా, ఖతార్ దేశంలోని దోహాలో తాలిబన్లతో నేరుగా, లాంఛనంగా చర్చలు ప్రారంభించేందుకు తన సంసిద్ధతను ప్రకటించాడు.

ఖతార్ మాజీ అధిపతి (ఎమిర్) షేక్ హమద్ బిన్ ఖల్యాఅల్‌థాని దోహాలో తాలిబన్ల ప్రతినిధులుండి తమ కార్యకలాపాలు సాగించుకునేందుకు వీలుగా విలాసవంతమైన భవన నిర్మాణానికి తాలిబన్లకు నిధులు సమకూర్చాడు. తాలిబన్లు ఇక్కడ తమ కార్యాలయాన్ని తెరిచారు. భవనంపై తమ పతాకాన్ని ఎగురవేశారు. తమను తాము "ఆఫ్ఘనిస్తాన్ ఇస్లామిక్ ఎమిరేట్"గా ప్రకటించుకున్నారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా అనుకూల శక్తుల మధ్య అధికారంకోసం తగవులు సాగుతున్నాయి. ఇతర రాజకీయ శక్తులూ, పోరాడుతున్న శక్తులూ వున్నాయి. ఉదాహరణకు ఉత్తరకూటమి అధికారంలో వున్నప్పుడు తాలిబన్లతో ఘర్షణలుపడుతూ, ద్వేషపూరిత సంబంధాలతో వుండేది. ఇప్పుడూ తాలిబన్లతో ఘర్షణ పడుతూనే వుంది. తాలిబన్లతో అధికారపోరులో అది ప్రధాన పోటీదారు. అమెరికాతో ఒప్పందం కుదిరి తాలిబన్లు అధికారంలోకివస్తే ఉత్తరకూటమి దానితో తలపడుతుంది.

తాలిబన్లతో అమెరికా చర్చల ప్రతిపాదన చేయటమంటే యుద్ధరంగంలో దానిని నాశనం చేయలేమన్న, అలాగే దొడ్డిదారిన వారిని కలిపివేసుకో లేమన్న వాస్తవాన్ని అంగీకరించటమే. కాస్త మెత్తని పద్ధతుల్లో వ్యవహరించి తాలిబన్లతో ఒక పాక్షిక లేదా పూర్తి ఒప్పందానికో అవకాశాన్ని చర్చలు యివ్వవచ్చు నని అమెరికా ఆశిస్తున్నది. అమెరికా, నాటోలు ఆఫ్ఘనిస్తాన్‌ను పూర్తిగా వదిలివేసి వెళ్ళాలని తాలిబన్లు ప్రస్తుతానికి అంటున్నారు. తమని తాము ఆఫ్ఘనిస్తాన్ ఇస్లామిక్ ఎమిరేట్‌గా ప్రకటించుకొని, చర్చలలో పాల్గొనటమంటే ఆఫ్ఘనిస్తాన్‌కు తామొక్కరమే సరైన ప్రతినిధులుగా గుర్తించాలని కోరుతున్నారు. దోహాలోని తమ కార్యాలయం ద్వారా "అవగాహన, చర్చల ప్రక్రియలో ప్రపంచంలోని దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకోవాల"ని తాలిబన్లు ఆశిస్తున్నారు. కనుక చర్చల ప్రక్రియ ముళ్ళబాటే.

చర్చలు ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం ద్వారా సాగాలని కర్జాయి డిమాండు చేస్తున్నాడు. అమెరికా తాలిబన్ల మధ్య నేరుగా చర్చలుసాగితే తన ప్రభుత్వ, తన ఉనికే వుండకుండా పోతుందనీ, తన వెనుక వారిద్దరు ఒప్పందం చేసుకుంటారన్నది కర్జాయి సమస్య. అందుకనే "ఆఫ్ఘన్ నాయకత్వంలో శాంతి ప్రక్రియ ఎంతకాలం సాగదో, అంతకాలమూ (కర్జాయి ఏర్పాటు చేసిన) ఉన్నత శాంతి సమితి ఖతార్ చర్చలలో పాల్గొనదు" అని కర్జాయి ప్రకటించాడు. ఆఫ్ఘనిస్తాన్ ఇస్లామిక్ ఎమిరేట్స్‌గా తాలిబన్లు ప్రకటించుకోవటానికి తీవ్ర అభ్యంతరం తెలిపాడు. (అమెరికా దురాక్రమణకు ముందున్న తాలిబన్ల ప్రభుత్వపు పేరిదే). దోహా కార్యాలయంలో తాలిబన్లు జండా ఎగురవేయటాన్ని నిరసిస్తూ, చర్చలను నిరవధికంగా బహిష్కరిస్తాననీ ప్రకటించాడు. ఖతార్ ప్రభుత్వ జోక్యంతో దోహాలోని కార్యాలయంపై జెండానూ, ఇస్లామిక్ ఎమిరేట్ అన్న ఫలకాన్ని రాత్రికి రాత్రే తాలిబన్లు తొలగించారు.

అయితే కర్జాయి తగాయిదాకు ఎలాంటి విలువలేదు. అమెరికా సామ్రాజ్యవాదుల మద్దతుతో కర్జాయి ప్రభుత్వం ఉనికిలోకి వచ్చి కొనసాగుతున్నది. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను రక్షించే చట్రానికి లోబడే కర్జాయి తగాయిదా సాగుతున్నది. అదే సమయంలో సామ్రాజ్యవాదశక్తుల మధ్యనున్న వైరుధ్యాలు కర్జాయికి కొంత బేరమాడగల అవకాశాన్నివ్వవచ్చు.

"ఆఫ్ఘనుల నాయకత్వంలో, ఆఫ్ఘన్ల ద్వారానే శాంతి పునరేకీకరణ ప్రక్రియ సాగినీరాల"ని రష్యా దౌత్యవేత్త జమీర్ కబులోవ్ అన్నాడు. అమెరికా సైన్యాల వునికిని ఆఫ్ఘనిస్తాన్‌లో కొత్తపేరుతో దీర్ఘకాల సైనిక ఉనికిగా రూపొందించే, దానికి కొత్త ముసుగు తొడిగే అమెరికా పథకాలకు ఐరాస తీర్మానం చేయకుండా మేము మద్దతు తెలుపం" అని రష్యా విదేశాంగ ఉపమంత్రి ఇగోర్ మోర్గులోవ్ అన్నాడు. శాంతి ప్రక్రియ ఆఫ్ఘనుల ద్వారానే సాగాలి అని భారత విదేశాంగ మంత్రి సాల్మన్ ఖుర్షీద్ అన్నాడు. ఆ వెంటనే ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైన్యాలు కొనసాగటానికి ఐరాస ఆమోదం అవసరంలేదనీ, ఎందుకంటే ఐరాస తరపున శాంతి రక్షణ దళంగా అక్కడ అమెరికా వ్యవహరించటంలేదని కూడా అన్నాడు. దీనికర్థం ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణను రష్యా, భారత్ పాలకులిరువురూ సమర్థిస్తున్నారు.

ఐక్యరాజ్యసమితి ఆమోదం ఉన్నా, లేకపోయినా ఏ కారణం చెప్పినా ఇది దురాక్రమణ యుద్ధమే; అన్యాయ యుద్ధమే. ప్రపంచదేశాల సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, భౌగోళిక సమగ్రతా హక్కును ఉల్లంఘించటమే. విదేశీ దురాక్రమణదారుల అక్రమ సంతానమూ, దాని కనుసన్నలలో బ్రతుకుతున్న కర్జాయి ప్రభుత్వానికి రష్యా, భారత పాలకుల మద్దతూ, ఐరాస ఆమోదించాలన్న రష్యావాదనలు దురాక్రమణను సమర్థించేవే గాక, వారి సంకుచిత ప్రయోజనాలను వెలిబుచ్చుతున్నాయి. సహజవనరుల నిలయంగా వుండి దక్షిణాసియాలో వ్యూహాత్మక స్థానంలో వున్న ఆఫ్ఘనిస్తాన్‌పై ఆధిపత్యం కొరకూ, దోపిడీ సొమ్ము పంపకం కొరకూ సామ్రాజ్యవాదుల మధ్య పోటీలో భాగమే ఇది. ఈ పోటీలో జారిపడే ఎంగిలి మెతుకుల కొరకు గోతికాడి నక్కలా భారత పాలకులు వ్యవహరిస్తున్నారు. ★

# బ్రిటన్

## విద్యార్థుల నిరసన – పోలీసు నిర్బంధకాండ

**బ్రిటీషు** ప్రభుత్వం ఉన్నత విద్యారంగానికి నిధుల కేటాయింపును తగ్గించివేస్తూ వస్తున్నది. దీనితో విశ్వవిద్యాలయాలు బోధనా సిబ్బందిని తగ్గించివేస్తూ, విద్యార్థులు చెల్లించవలసిన ఫీజులను పెంచివేస్తున్నాయి. అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించటం, వివిధ విద్యాసేవలను ప్రైవేటీకరించటమన్న పద్ధతులతో బోధనా సిబ్బందికి ఉద్యోగ భద్రత, తక్కువ వేతనాల సమస్య ఎదురౌతున్నది. మరోవైపున ఫీజులను పెంచి వేయటంతో విద్యార్థులు బ్యాంకుల నుండి తీసుకున్న విద్యారుణం పెరిగిపోయి భారమౌతున్నది. విద్యార్థిగా వుంటూనే పనిచేసేందుకు గల ఉపాధి అవకాశాలూ, అలాగే విద్య ముగిసిన తర్వాత ఉపాధి అవకాశాలూ తగ్గిపోయాయి. నిరుద్యోగసమస్య తీవ్రస్థాయికి చేరింది. దీనితో బ్యాంకు రుణం తీర్చటానికి దారిలేని పరిస్థితి విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇది విద్యార్థి లోకంలో అశాంతికి కారణంగా వుంది.

2010 నుండి ఉన్నత విద్యారంగంలో అమలవుతున్న ఈ విధానాల పట్ల విద్యార్థులు, అధ్యాపకుల్లో నిరసన వ్యక్తమయింది. ఈ అశాంతిని అణచివేసేందుకు బ్రిటీషు ప్రభుత్వం నిర్బంధకాండకు దిగింది. 2010లో పెల్లుబికిన విద్యార్థుల నిరసన సందర్భంలో వందలాదిమంది విద్యార్థులను అరెస్టు చేసింది. 2011లో యువత పెద్దఎత్తున నిరసనలకు దిగింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బలప్రయోగానికి దిగటంతో మార్క్ దుగ్గన్ అన్న యువకుడు మృతిచెందాడు. విశ్వవిద్యాలయం గోడలపై నినాదాలు రాస్తున్న యువతిని పట్టుకుని 16 మంది పోలీసు అధికారులు కలిసి బట్టలూడదీసి కొట్టిన ఫోటోలను ఆనాడు గార్డియన్ పత్రిక ప్రచురించింది.

2013 నవంబరు నెలలో తమ వేతనాల పెంపుదల, ఉద్యోగ భద్రత కోరుతూ అధ్యాపకులు ఒకరోజు సమ్మెలు చేసారు. విద్యార్థులు డిసెంబరు 3న ఉన్నత విద్యాసమ్మెను ప్రకటించారు. లండను, సనెక్స్ విద్యాలయాలు కేంద్రంగా విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేశారు.

అంతకుముందు రెండునెలల నుండీ విద్యార్థులపై నిర్బంధకాండ సాగుతున్నది. యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు మైకెల్ ఛెసమ్, ఉపాధ్యక్షుడు డేనియల్ కూపర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులలో ఏజంట్లను చొరబెట్టి పోలీసులు వీడియోలు తీసి విద్యార్థులపై కేసులు మోపుతున్నారని వీడియో ఫోటోలతోసహా గార్డియన్ పత్రిక ప్రచురించింది. ఐదుగురికి మించి గుమిగూడినచోట ఉండబోమన్న షరతును అంగీకరించినవారికే బెయిలు యిస్తున్నారు.

డిసెంబరు 4న 70 మంది విద్యార్థులు లండను విశ్వవిద్యాలయం ముఖ్య కార్యాలయాన్ని ఆక్రమించి నిరసన తెలిపారు. 100 మంది గల ప్రత్యేక పోలీసుదళం దాడిచేసి విద్యార్థులపై లాఠీఛార్జీ చేసింది.

మరుసటిరోజున పోలీసు నిర్బంధానికి నిరసనగా 200 మంది విద్యార్థులు ప్రదర్శనచేశారు. పోలీసులు విరుచుకుపడి విద్యార్థులను చావబాదారు. "మార్క్ దుగ్గన్‌ను చంపిందెవరు?" అని విద్యార్థులు నినదిస్తూ ప్రతిఘటించారు. 36 మందిని అరెస్టు చేశామని పోలీసులు ప్రకటించారు.

కార్యాలయాలను విద్యార్థులు దిగ్బంధనం చేయరాదంటూ విశ్వవిద్యాలయ యాజమాన్యాలు కోర్టుల నుండి ఇంజక్షను ఆర్డర్లు తెచ్చుకుంటున్నాయి. ప్రదర్శన చేసినందుకు ఆరుగురు విద్యార్థులను సనెక్స్ విశ్వవిద్యాలయం సస్పెండ్ చేసింది. అంతేకాక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రదర్శనలను నిషేధించే ఉత్తర్వులను కోర్టు నుండి తెచ్చుకుంది. లివర్‌పూల్, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయాలు కూడా కోర్టుల నుండి ఇలాంటి ఉత్తర్వులే తెచ్చుకున్నాయి. అనేకమంది విద్యార్థులను సస్పెండ్‌చేశాయి. వారిపై పోలీసు కేసులు పెట్టాయి. లివర్‌పూల్ విద్యార్థులు క్లాసు రూములో పాఠాలు వింటుండగా, ఐదుగురికంటే ఎక్కువ గుమిగూడారంటూ పోలీసులు కోర్టు ఉత్తర్వులు చూపి వారిని క్లాసు రూము నుండి పంపించివేశారు.

ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న రాజకీయ ప్రతిపక్షాన్ని అణచివేయజూనుకున్న ప్రభుత్వనిర్ణయంలో భాగంగానే విద్యార్థులపై రాజ్యహింస సాగుతున్నది. 2010 నుండి విద్యార్థులపై సాగుతున్న ఈ రాజ్యహింస నానాటికీ పెరుగుతున్నది. విద్యార్థుల నిరసన 2010లో లాగా ప్రజానిరసనలకు దారితీయకుండా నివారించే లక్ష్యంతో ప్రభుత్వం నిర్బంధకాండకు పూనుకుంది.

మరోవైపున అస్తిత్వవాద ధోరణులను - ప్రధానంగా ఫెమినిస్టు, జాతివిద్వేష, అరాచక - ధోరణులను విద్యార్థి ఉద్యమంలో బ్రిటన్ పాలకవర్గాలు ప్రవేశపెడుతున్నాయి. వీటిద్వారా విద్యార్థి ఉద్యమాన్ని చీల్చటమే కాకుండా, విద్యార్థులు మార్క్సిజంవైపూ, వర్గపోరాటంవైపూ మరలకుండా చేస్తున్నాయి. ఆ విధంగా విద్యార్థుల నిరసనను పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రంలోనే బిగించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ కమ్యూనిస్టు వ్యతిరేక చట్రం నుండి బయటపడి, బ్రిటన్ పెట్టుబడిదారీ విధానంపై విద్యార్థులు తమ పోరాటాన్ని ఎక్కుపెట్టాల్సిన అవసరముంది. ★

### రచ్చ చావడిలో... (మొదటిపేజీ తరువాయి)

దీనిలోని వితండవాదమేమంటే అంతర్రాష్ట్ర వివాద మవుతుంది గనుక ముంపు ప్రాంతాన్ని తమకివ్వ మనటం. దీని కొనసాగింపు కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాలను కర్ణాటక, మహారాష్ట్రల నుండి విడదీసి యివ్వాలన్న వాదనే. అంతర్రాష్ట్ర ప్రజల వివాదాలను సామరస్యంగా పరిష్కరించే ప్రయత్నం ఈషణ్మాత్రమూలేదు. ఈ వాదన వేడిలో దాచిపెడుతున్న అసలు విషయమేమంటే జల వివాదాల పరిష్కారానికి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ సూచించిన అంతర్రాష్ట్ర మండలి ఏర్పాటును కేంద్రం బుట్టదాఖలుచేసి, కృష్ణా, గోదావరి జలాలపై అధికారాన్ని విభజనబిల్లులో తనకే కట్టబెట్టుకుంది. దీని గురించి ఏ ఒక్కరూ పల్లెత్తుమాట కూడా అనక పోవటమే ప్రజా ప్రయోజనాలీడేర్చటం వీరి పరమావధికాదని స్పష్టం చేస్తున్నది.

విభజనతో సంక్లిష్టమయ్యే సమస్యలుగానీ, ప్రజల మౌలిక సమస్యలుగానీ పాలకవర్గాలకు సమస్యలు కావు. తమ అధికార పంపక తగవులో అవి పాచికలు మాత్రమే. అందుకే ఈ రచ్చంతా సాగుతున్నది. తెలుగువారి అసలు సమస్యలు వారెవ్వరికీ పట్టవు. ఆ సమస్యలన్నింటికీ కారణమైన దోపిడీ వర్గపాలనను కూలద్రోసి జాతి సమగ్రాభి వృద్ధికి దోహదపడే నూతన ప్రజాస్వామిక సమాజ స్థాపనకు సమాయత్తంకావటమే ప్రజల ముందున్న కర్తవ్యం.

15-2-14 ★

# ఈశాన్య భారత పౌరులపై దాడులు, ఘోరాలు - పాలకుల జాతివివక్షా విధానాల ఫలితమే!

**దేశ** రాజధాని న్యూఢిల్లీలో 2014 జనవరి 29న అరుణాచలప్రదేశ్‌కు చెందిన నిడో తానియా అనే విద్యార్థి రంజిత్ మార్కెట్ ప్రాంతంలోని కొందరు వ్యాపారుల చేతిలో పట్టపగలు మారణాయుధాలతో తీవ్ర దాడులకు గురయ్యాడు. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే నిడోపవిత్ర కుమారుడైన నిడో తానియా (19సం॥లు) తీవ్రగాయాలతో ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ జనవరి 31వ తేదీన మరణించాడు. దాడికిముందు ఈశాన్య ప్రాంత రాష్ట్రానికి చెందిన నిడోను తీవ్ర జాతి వివక్షకు గురిచేస్తూ నీచంగా మాటలతో, చేష్టలతో అక్కడి వ్యాపారులు వేధింపులకు గురిచేశారు. ఆత్మాభిమానం తీవ్రంగా గాయపడి ఆగ్రహానికి గురైన ఆ విద్యార్థి ఓ దుకాణపు కిటికీ అద్దాలు పగులగొట్టాడనే సాకుతో మూకుమ్మడిగా అతనిపై మారణాయుధాలతో దాడిచేశారు.

ఈ సంఘటన తాజాగా వుండగానే, దక్షిణ ఢిల్లీలోని మునిర్కా ప్రాంతంలో ఓ అద్దె ఇంటిలో నివసిస్తున్న మణిపూర్‌కు చెందిన 14సం॥ల ఓ బాలికను బహిరంగంగా బజార్లగుండా నిర్బంధించి, తీసుకెళ్ళిన ఆ ఇంటి యజమాని కుమారుడు విక్కీ ఆ అమ్మాయిపై ఘోరంగా అత్యాచారం జరిపాడు.

ఫిబ్రవరి 2వ తేదీ రాత్రి జన్‌ఖాన్ సువాన్ నౌలాంగ్ (24సం॥లు), వమ్ సువాన్ మంగ్ నౌలాంగ్ (25స॥లు) అనే మణిపూర్‌కు చెందిన మరో ఇద్దరు యువకులు దక్షిణ ఢిల్లీలోని అంబేద్కర్‌నగర్‌లో జాత్యహంకార వివక్ష, అవమానాలతోపాటు తీవ్రమైన దాడులకు గురయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా వుంది.

దేశ రాజధాని నగరంలో దాదాపు ఒక నెల కాలవ్యవధిలోనే ఈశాన్య ప్రాంత వాసులపై సాగుతున్న జాత్యహంకారదాడులు, అత్యాచారాలకు సంబంధించిన సంఘటనలివి! కాగా, ఈ సంఘటనలకు కారకులైన దోషులను అరెస్టు చేయటంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తూవున్నారు.

2013లో 'బ్రిక్స్' దేశాల సదస్సు ఢిల్లీలో జరిగినప్పుడు అస్సాం, మణిపూర్, మిజో, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన ప్రజలను బస్సులలో, రోడ్లపై, ఇళ్ళలో పోలీసులు సోదాలు జరుపుతూ, వారి గుర్తింపుకార్డులను చూపాలని పదేపదే వేధింపులకు గురిచేశారు.

గత సంవత్సరం, చైనాకు చెందిన ఇద్దరు సింగపూర్ మహిళలపై గోవాలో వేధింపులు; ప్రస్తుత ఢిల్లీ ప్రభుత్వంలో హోంశాఖామంత్రి భరతీ ఆధ్వర్యంలో ఇటీవలే ఢిల్లీలో ఆఫ్రికా మహిళలపై వేధింపుల సంఘటనలు అందరిదృష్టిలో ఉన్నవే!

నిడో హత్యను నిరసిస్తూ ఢిల్లీలో నివశిస్తున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజానీకం, వారి సంఘాల ప్రతినిధి బృందాలు ఆందోళనలు చేశారు. ఈశాన్య రాష్ట్రాలలో ఈ సంఘటనలకు నిరసనగా సాగిన ప్రజాందోళనలతో పాటుగా దేశవ్యాపితంగా ప్రజాస్వామికవాదులు, మేధావులు, వివిధ రాజకీయ పక్షాలు ఈ ఘటనలను నిరసించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం ఈశాన్య ప్రాంతవాసుల సమస్యలపై మొసలికన్నీరు కారుస్తూ, మొక్కుబడి చర్యలకు పరిమితమౌతోంది. కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్‌గాంధీ ఢిల్లీలోని ఈశాన్య ప్రాంతవాసుల ఆందోళనా శిబిరంవద్దకువెళ్ళి వారికి సంఘీభావం తెలియజేయటంతోపాటు, నిడో తానియా హత్యపై సిబిఐ దర్యాప్తు చేయనుందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ ద్వారా ప్రకటన చేయించాడు. ఢిల్లీలోనూ, దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ విద్య, ఉద్యోగరీత్యా నివాస ముంటున్న ఈశాన్యప్రాంత వాసుల సమస్యలన్నింటినీ పరిశీలించి, వాటి పరిష్కార మార్గాలను కనుగొనేందుకు రెండునెలల కాలవ్యవధిలో నివేదిక అందజేయ వలసిందిగా కోరుతూ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎంపి బెజ్‌బారువా నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పరిచారు.

ఢిల్లీలో నివసిస్తున్న ఈశాన్య ప్రాంతవాసులకు ప్రాతినిధ్యం వహించే సంస్థలు, కేంద్రప్రభుత్వం నియమించిన ఈ కమిటీని తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల ప్రాతినిధ్యంతో కూడిన కమిటీని నియమించాలని కోరుతున్నాయి.

ఏమైనా, ఈశాన్యప్రాంత వాసులపై దాడులు ఈనాడు కొత్తగాదు-ఢిల్లీ, ముంబయి, బెంగళూరు తదితర దేశంలోని వివిధ ప్రాంతాలలో విద్యా, ఉద్యోగాల నిమిత్తం నివాసముంటున్న వీరిపై జాతిపరమైన వివక్ష, అవమానాలు, అత్యాచారాలు, దాడులు, హత్య గావించటం వంటి సంఘటనలు గతంలో అనేకం జరిగివున్నాయి.

2012 బెంగుళూరులో లోయితమ్ రిచర్డ్ అనే ఓ మణిపూరి విద్యార్థిని తీవ్రవివక్షకు గురిచేసి, అవమానించి, హత్యకు పాల్పడి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నించారు. 2012లోనే నోయిడాలో మేఘాలయ బాలిక దీనా సంగ్మా జాతిపర వివక్షల నెదుర్కొంటూ, అనుమానాస్పద పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడింది. బెంగళూరులో ఈశాన్య ప్రాంతవాసులపై జరిగిన దాడులకు భీతిల్లి, ఉన్నఫళంగా ఉద్యోగాలు, చదువులు వదలుకొని తమతమ రాష్ట్రాలకు పయనించటంతో రైల్వేస్టేషన్లు, రైళ్ళు కిక్కిరిసిపోవటం అందరి గమనంలో వున్నదే. ప్రభుత్వాలు అప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమన చర్యలు తీసుకొని సమస్యను చల్లార్చటం మినహా జాతివివక్ష తలెత్తకుండా పరిష్కారమార్గాలను చేపట్టటంలేదు.

అస్సాం, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, త్రిపుర, సిక్కిం, మణిపూర్ - కొండప్రాంతాలైన ఈ ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలనుండి వచ్చి ఒక్క ఢిల్లీనగరంలోనే 2లక్షలపైగా ప్రజలు నివశిస్తున్నారు. వీరందరికీ అద్దె ఇళ్ళు దొరకటమే దుర్లభమౌతూవుంది. ఈశాన్య ప్రాంతవాసులకు ఇళ్ళుఅద్దెకివ్వటానికి ఇంటి యజమానులు సిద్ధం కాకపోవటమేగాక, వారందరినీ అనుమానితులుగా పరిగణిస్తూ అవమానానికి గురిచేస్తుంటారు. ఇల్లు ఒకవేళ అద్దెకిస్తేకూడా ఇతరులకంటే అద్దె షుమారు రెట్టింపుగా వసూలుచేస్తుండటంతోపాటు, సవాలక్ష నిబంధనలు విధిస్తున్నారు. ఇక, దీనితోపాటుగా బయటకు వెళ్ళితే, షాపులవద్ద, మార్కెట్లో, పనిప్రదేశాల్లో, కార్యాలయాల్లో, విద్యాసంస్థలలోనూ వీరిని చిన్నచూపు చూస్తున్నారు. 'చింకీ' 'చౌమీ' 'మొమోస్' తదితర పేర్లతో పిలుస్తూ వీరి శరీర ఆకారాలను అవమానిస్తూ గేలి చేయటమనేది సర్వసాధారణంగా జరుగుతూవస్తోంది. ఈశాన్య ప్రాంతవాసులను తరచూ చైనా, టిబెట్, నేపాల్‌ల నుండిగానీ వచ్చావా అని ప్రశ్నిస్తూ ఉంటారు. దుకాణదారులు వీరి వద్ద అధిక ధరలు వసూలు చేస్తూ ఉంటారు. వీరి పేరును సరిగా ఉచ్ఛరించకుండా అనేకమార్లు చెప్పినప్పటికీ అవహేళన చేస్తూ పిలుస్తూ ఉంటారు. స్థానికులకు భయపడి తరచూ వీరు తమ నివాసాలను మార్చుకుంటూ ఉండాల్సివస్తోంది. బయటికి వెళ్తున్న ఈ ప్రాంత మహిళలంతా ఏదో విధమైన వేధింపులను, అవమానాలను ఎదుర్కోవటం సాధారణంగా మారిపోయింది. కాగా, ఢిల్లీలో ఇతరుల కంటే ఈశాన్య ప్రాంత మహిళలు 87శాతం ఒకసారి లేదా అంతకుమించి లైంగిక వేధింపుల నెదుర్కొంటున్నారని ఓ సర్వే తెలియజేసింది. వీరి రంగు, రూపం, వేషధారణ, ఆహారపు అలవాట్లు, భాష అన్నీ వివక్షకు, అవమానానికి గురిచేయబడుతున్నాయి.

ఒక ప్రాంతం నుండి వచ్చినవారు మహా నగరాలలో ఒకేచోట నివాసమేర్పరచుకోవటం సహజం. పౌరసౌకర్యాలు తక్కువగా వున్నచోట తమకందు బాటులో ఇళ్ళు అద్దెకు లభిస్తాయి గనుక అక్కడ నివశిస్తారు. ఇళ్ల స్వంతదారులు మొదట్లో దీనిని ఆనందంగా ఆహ్వానించారు. కాలక్రమంలో పౌర సదుపాయాలు పెరగటంతో రియల్‌ఎస్టేటు శక్తులు రంగప్రవేశం చేస్తున్నాయి. తమ లాభార్జన కోసం ఈ నివాస ప్రాంతాలను ఆధిపత్యంలోకి తెచ్చుకునేందుకు అక్కడ నివశిస్తున్న దూరప్రాంతవాసులను ఖాళీ చేయించే ప్రయత్నాలను జాతివివక్షా దాడులుగా మార్చుతున్నారు. ఇన్నాళ్ళూ సహజీవనం చేసిన ప్రజల మధ్య వున్న సాంస్కృతిక భిన్నతను, వైమనస్యాలుగా, దాడులుగా మార్చి ఉద్రిక్త వాతావరణం కల్పిస్తున్నారు. దాడుల వెనక పొంచివున్న దోపిడీ ప్రయోజనాలివి.

'స్వాతంత్ర్యా'నంతరం ఆరున్నర దశాబ్దాలపైగా కాలంలో కూడా 8 రాష్ట్రాల ఈశాన్య ప్రాంత ప్రజానీకం విద్యా ఉద్యోగావకాశాలకోసం ఇతర ప్రాంతాలకు పెద్దఎత్తున వలసలు వెళ్ళటానికి ఎందుకు నెట్టబడుతున్నారు? అనేది ఒక ముఖ్యమైన అంశం. కాగా, దేశంలోని వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్ళే వారిపైన జాతిదురహంకార వివక్ష, దాడులు ఎందుకు కొనసాగుతున్నాయి? ఎందుకు పెచ్చుమీరుతున్నాయనే అంశాలను పరిశీలించాలి.

అధికారమార్పిడి తదనంతరం భారత పాలకులు బ్రిటిష్ వలసపాలన కనుగుణంగానే ఈశాన్య ప్రాంత రాష్ట్రాలలో విద్యా, ఉద్యోగావకాశాలను పెంపొందించ టంలో, పారిశ్రామికంగా అభివృద్ధి సాధించటంలో ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో వ్యవహరించారు. ఈ ప్రాంతంలోని చమురు, ఖనిజాలు తదితర వనరులను ఈ ప్రాంతంలోనే ఉపయోగించి పరిశ్రమలు అభివృద్ధి చేయకుండా ఈ రాష్ట్రాలను పర్యాటక ప్రాంతంగా పరిమితం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న పరిమిత వనరులను కూడా దేశంలోని ఇతర ప్రాంతాలకు తరలించి, ఈ ప్రాంతవాసులను తీవ్రవెనుకబాటు తనంలో మిగిల్చారు. త్రిపుర వంటి రాష్ట్రాలలోకి పొరుగున్న పశ్చిమబెంగాల్‌నుండి వచ్చినవారు అధిక సంఖ్యాకులై, ఆ రాష్ట్రవాసులనే మైనారిటీలుగా మిగిల్చారు. మరోవైపున సరిహద్దు రాష్ట్రాలుగా వున్న వీటిల్లోకి చొరబాటుదార్ల ప్రవేశం పేరున నిరంతర ఉద్రిక్త పరిస్థితులను రగిలిస్తూ వచ్చారు. ప్రజల వాస్తవ, మౌలిక సమస్యలను పరిష్కరించకుండా, మరోవైపున ప్రజల దృష్టి అటువైపు మరలకుండా ఆయా రాష్ట్రాల్లో అంతర్గత తగవులను, గ్రూపులను పెంచి పోషించి రావణకాష్టాన్ని నిరంతరం రగిలిస్తూవస్తున్నారు. ఉగ్రవాదుల, చొరబాటుదారుల అణచివేత పేరుతో సైనికబలగాలను మోహరించి నిరంతరదాడులు కొనసాగిస్తూ వస్తున్నారు.

ఈ విధమైన నిరంతర అనిశ్చితి, అభద్రతల నేపథ్యంనుండి సమస్యలు పరిష్కరించకుండా, పాశవిక నిర్బంధం సాగుతున్న స్థితిలో కాలేజి చదువులు సాఫీగా సాగించేందుకోసం, ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ ఈశాన్య ప్రాంతవాసులు ప్రధానంగా, ఢిల్లీ, బొంబాయి, బెంగళూరువంటి మహానగరాలకేకాక, దేశంలోని వివిధ పట్టణాలకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వీరికి తమ ప్రాంతభాష మినహా మరోభాష-ముఖ్యంగా హిందీ రాకపోవటం, ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం అంతంత మాత్రం కావటమనే అంశాలను-వారిని వివక్షకు గురి చేయటానికి సాధనంగా తరగతి గదులలో అధ్యాపకులు మొదలుకొని, తోటి విద్యార్థుల వరకు ఉపయోగించు కుంటున్నారు.

ప్రభుత్వాలు అనుసరిస్తున్న మెజారిటీ హిందూ మతతత్వ, జాతిదురహంకార విధానం కారణంగా ఈశాన్య రాష్ట్రాల ప్రజానీకం తామంతా ఈ దేశ వాసులమేననీ, ఈ దేశంలో తాము ఆత్మగౌరవంతో జీవించటంతోపాటు ఇతర పౌరులతోపాటు సమాన హక్కులు, సమాన అవకాశాలు పొందగలుగుతామనే ఆశలను కోల్పోయారు. దీనికితోడు దేశప్రధాన భూభాగంలో తమపై నిరంతరం సాగుతున్న దాడులు, వివక్ష, అత్యాచారాలు, హత్యలతో వారిలో అత్యధికులు ఈ దేశం మనందరిదీ అనే మానసిక భావనలో లేరు. ఈ ప్రాంత ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను, జాతీయ వాంఛలను దశాబ్దాలుగా క్రూరంగా, నిరంకుశంగా అణచివేస్తూ వచ్చిన పాలకుల విధానాల ఫలితంగా తాము ఈ దేశంనుండి విడిపోవాలనే డిమాండ్లు కూడా వీరు ముందుకు తెస్తున్నారు. తిరిగి వీటిని సాకుగా చూపి ప్రభుత్వం, వాటికి వేర్పాటువాద ఉద్యమాల పేరుపెట్టి, వారి గొంతు నొక్కివేస్తున్నది.

జమ్ముకాశ్మీర్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాలన్నింటిలో సైనిక బలగాల విశేషాధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పిఏ) వంటి క్రూరమైన చట్టాలను 1958నుండే అమలుచేస్తూ అనుమానితులుగా భావించిన ఎవరినైనా పట్టుకొని కాల్చిచంపే అధికారాలను సైనికులకు ప్రభుత్వం కట్టబెట్టింది. భారతదేశంలోని పౌరులందరి జీవితాలకు భద్రత, వ్యక్తిగత స్వేచ్ఛ, రక్షణలకు గ్యారంటీనిస్తాయని చెప్తున రాజ్యాంగంలోని 21, 22 అధికరణాలను తుంగలో తొక్కింది. 'అసలే కోతి... పైగా కల్లు తాగింది... ఆపై నిప్పుతొక్కింది' చందంగా, ఎలాంటి జవాబుదారీతనంలేని విశేషాధికారాలను చెలాయిస్తూ సైనిక బలగాలు జమ్ముకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో సాగిస్తున్న ఘోర దురంతాలకు అంతులేకుండా వుంది. మహిళలపై అత్యాచారాలు, గ్రామాలపై దాడులు, నిద్రిస్తున్న యువకులను ఇంటి నుండి తీసుకెళ్ళి ఉగ్రవాదుల పేరున మట్టుబెట్టటం, పట్టపగలు బహిరంగంగా నిరాయుధులను కాల్చి చంపి ఎదురు బొదురు కాల్పులని ప్రకటించడం వంటి సంఘటనలనేకం జరుగుతూవస్తున్నాయి. మహిళలపై సైనికులు సాగిస్తున్న అత్యాచారాలకు విసిగెత్తిన మధ్యవయస్కులైన మహిళలు కొందరు 2004లో అస్సాం రైఫిల్ సైనికాధికారుల ప్రధాన కార్యాలయం ఎదుట 'మాపై అత్యాచారం జరపండి' అనే బ్యానర్‌ను ప్రదర్శిస్తూ నగ్న ప్రదర్శన చేయటం సైనికాధికారుల అకృత్యాలను వెల్లడిచేయటానికి పరాకాష్ట చర్య! అదేవిధంగా 2000 జులై 11న తంగజమ్ మనోరమ అనే మహిళను నిద్రిస్తుండగా లేపి తీసుకెళ్ళిన సైనికులు, ఆమెపై సాయుధ తీవ్రవాది అనే ముద్రవేసి, అత్యాచారం జరిపి ఆపై ఘోరంగా హత్యగావించారు. మణిపూర్‌లోనేగాక, దేశవ్యాపితంగా సంచలనం కలిగించిన ఈ దుర్మార్గాన్ని నిరసిస్తూ, ఏఎఫ్ఎస్‌పిఏను రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ ఇరోం షర్మిల గత 14సం॥లుగా నిరాహారదీక్ష చేస్తున్న సంగతీ విదితమే. 2009 జులై 23న మణిపూర్ రాష్ట్రరాజధాని ఇంఫాల్ నగర నడిబొడ్డున చోంగుకామ్ సంజీవ్‌పై జనసమ్మర్దంగా ఉన్న ప్రాంతంలో సాయుధబలగాలు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో సంజీవ్‌తోపాటుగా రబీనాదేవి అనే గర్భిణీ స్త్రీ కూడా అక్కడికక్కడే మరణించింది. అనేకమందికి తూటాల గాయాలయ్యాయి.

బ్రిటీష్ పాలనానంతరం భారతదేశాన్ని వివిధ సామ్రాజ్యవాద దేశాల విచ్చలవిడి దోపిడీకి అనువైన పెరడుగా దళారీ పాలకులు మార్చివేశారు. దేశంలోని ఫ్యూడలిజాన్ని తన సామాజిక పునాదిగా చేసుకున్న సామ్రాజ్యవాదం దేశంలో స్వతంత్ర పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కాకుండా నిరోధిస్తూ వస్తోంది. దానితోపాటుగా దేశంలో కీలకమైన వ్యవసాయ, పారిశ్రామికరంగాల్లో సామ్రాజ్యవాద దోపిడీకి అనుగుణమైన విధానాలను అనుసరిస్తూ, పెద్దఎత్తున దేశంలోని సహజ సంపదలను, శ్రమశక్తిని దోపిడీ చేసుకెళ్తోంది. ఈ కుట్రపూరిత విధానంలో భాగంగానే దేశంలో సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టకుండా కొన్ని ప్రాంతాలను తన దోపిడీ అవసరాల మేరకు అభివృద్ధి చేస్తూ, దేశంలోని విశాల ప్రాంతాలను ఎలాంటి అభివృద్ధికీ నోచుకోని ప్రాంతాలుగా పడావు పెడ్తుంది. దీనితో సహజంగానే సాపేక్షంగా విద్యా, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్న నగరాలకు, ఇతర ప్రాంతాల నుండి ప్రజలు వలసలు పోతారు. దీనితో తమ అవకాశాలన్నింటినీ వలస ప్రజానీకం కొల్లగొట్టుకెళ్తున్నారనే అభద్రతా భావానికి స్థానికంగా ఉన్న ప్రజలు గురిచేయబడుతున్నారు. దోపిడీ పాలకులకు సరీగ్గా కావలసింది కూడా ఇదే! ప్రాంతీయ అసమానతలను పెంచి పోషిస్తున్న వీరే, ప్రాంతీయ విద్వేషాలను దేశవ్యాపితంగా రెచ్చగొడ్తూ తిరిగి దానికీ వారే నాయకత్వంవహిస్తూ నిరంతరం ప్రజల మధ్య ఆరనిమంటలు రాజేస్తూ తమ ఓట్ల, ఎన్నికల ప్రయోజనాలకు వీటిని సాధనాలుగా మలుచుకొంటున్నారు. ఇదే విధంగా ప్రజల మధ్య ఐక్యత పెంపొందకుండా కుల, మత, జాతి, లింగపరమైన వివక్ష, విద్వేషాలను రెచ్చగొడుతూ దీర్ఘకాలం తాము అధికారంలో కొనసాగే విధానాలను అనుసరిస్తున్నారు.

ముంబయి మహానగరంలో ఉద్యోగావకాశాలన్నీ మహారాష్ట్ర వాసులకే దక్కాలని, బీహారీయులను, ఇతర రాష్ట్రాలవారని తరిమివేయాలని శివసేన రెచ్చగొట్టిన ఉద్రిక్తతలు ఈ కోవలోవే.

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్ జిల్లాలో గత సంవత్సరం నవంబరులో పాలకులు రెచ్చగొట్టిన మత ఉద్రిక్తతలు, మతోన్మాద దాడులు పాలకుల దీర్ఘకాలిక పథకంలో భాగమే.

పొద్దస్తమానం రాజ్యాంగం గురించి, దాని పవిత్రత, విశిష్టతల గురించి జపంచేసే ఈ పాలకులు, భిన్నత్వంలో ఏకత్వం గురించి గొంతుచించుకునే పాలకులు - దేశంలోని పౌరులు ఏ ప్రాంతానికి చెందినవారైనా, ఏ ప్రాంతంలోనైనా స్వేచ్ఛగా సంచరించటానికి, ఆత్మగౌరవంతో జీవించటానికి వున్న అవకాశాలను, హక్కులను నిరంతరం కాలరాచి వేస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ, జాతి, లింగ పరమైన వివక్ష, దాడులకు అవకాశంలేని పాలనను కొనసాగించాలన్న దానికి భిన్నంగా పాలకులు వ్యవహరిస్తున్నారు. నిరంతరం మీడియా ఈ ఉద్రిక్తతలను రగిలించటంలో ముందుంటున్నది. కుల, మత, ప్రాంతీయ, తదితర సంకుచిత భావాలకు భిన్నంగా ప్రజాస్వామికంగా ఆలోచించాల్సిన అనేక మంది మేధావులు సైతం ఉన్మాదాలకు, ఉద్రిక్తతలకు కొమ్ముగాస్తున్నారు.

మరీ ముఖ్యంగా - భిన్న భాషలకు, భిన్న జాతులకు నిలయమైన మన దేశంలో సమభావనతో సహజీవనం చేయాలనే సహిష్ణుతను పెంపొందించ టంలో కీలకమైన విద్యావిధానం దేశ, జాతి, భాషా దురభిమానాల్ని, ప్రాంతీయ విద్వేషాలను, అగ్రకుల భావనలను, సంఖ్యాపరంగా మెజారిటీ హిందూ మత భావాలను, పురుష దురహంకార పితృస్వామ్య భావనలను ప్రాథమిక విద్య నుండి విద్యార్థుల È

# విదేశాలకు ప్రవాహంలా తరలిపోతున్న సంపద

**విదేశీ** పెట్టుబడి మనదేశ ద్రవ్య వనరులను పీల్చివేసి తమ దేశానికి తరలించుకుపోతుంది. విదేశీ మారకద్రవ్య స్థితిని ఎప్పటికీ సంకట స్థాయిలోనే వుంచుతుంది. మన దేశంలో పెట్టుబడి మదుపునకు అవసరమైన పెట్టుబడి ప్రోగుదలను తగ్గించి వేస్తుంది. అసలు, వడ్డీలు, లాభాలు, రాయల్టీల రూపంలోనే కాకుండా అనేక చట్టవ్యతిరేక పద్ధతులద్వారా ద్రవ్య వనరులను ప్రవాహంలా తరలించుకుపోతుంది. ఆ విధంగా మనదేశాన్ని శాశ్వతపరాధీనతలోకి నెడుతుంది.

ఈ నిలువు దోపిడీలో ఒక పద్ధతి రాయల్టీల చెల్లింపు. కీలకమైన సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలు, డిజైన్లు పొందినందుకూ, సరుకు వాణిజ్య నామం, ట్రేడు మార్కులు వాడుకున్నందుకూ ప్రతి ఏడాదీచేసే చెల్లింపులను రాయల్టీలంటారు. ప్రభుత్వాలు ఈ రాయల్టీల చెల్లింపుకు కొన్ని షరతులు విధించటంద్వారా ద్రవ్యవనరుల తరలింపును నియంత్రిస్తాయి.

దేశంలోని ఏ కంపెనీ అయినా తన ఎగుమతుల ఆదాయంలో 8 శాతం లేదా దేశీయ అమ్మకాల ఆదాయంలో 5 శాతంవరకూ సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి రాయల్టీగా విదేశీ కంపెనీకి చెల్లించవచ్చును. వాణిజ్యనామం, ట్రేడ్‌మార్కులు వాడుకున్నందుకు ఎగుమతి ఆదాయంలో 2 శాతం లేదా దేశీయ అమ్మకాల్లో 1 శాతం రాయల్టీగా చెల్లించవచ్చును. ఈ నిబంధన 2009 వరకూ అమలులో వుండేది.

ఈ నిబంధన అమలులో వుండగానే రాయల్టీల ద్వారా అధిక మొత్తాలు విదేశాలకు తరలిపోయేది. 2009-10లో రాయల్టీల చెల్లింపు ఆ ఏడాది దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో 13 శాతంగా వున్నది. అంటే దేశంలోకి ప్రతి రూపాయి పెట్టుబడికీ 13 పైసలు రాయల్టీగా పోగా నికరంగా వచ్చింది 87 పైసలు. 2009-10లో మారుతీ కార్లకంపెనీ జపాను సుజుకీ కంపెనీకి చెల్లించిన రాయల్టీ రూ.1500 కోట్లు. ఇదికాక దిగుమతి చేసుకున్న విడి భాగాలకూ చెల్లింపు, లాభాల్లో వాటా, జపాను మేనేజర్ల జీతాలు వుంటాయి.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాకను ప్రోత్సహించే పేరుతో తీసుకున్న అనేక చర్యలలో భాగంగా రాయల్టీల చెల్లింపుపై వున్న నిబంధనలను పూర్తిగా తొలగించి వేశారు. దీనితో రాయల్టీల చెల్లింపులు విదేశీ పెట్టుబడి రాకలో 2010-11లో 15 శాతానికీ, 2012-13లో 18 శాతానికీ పెరిగాయి.

2012-13లో అత్యధిక రాయల్టీ చెల్లించిన ఐదు కంపెనీలు : మారుతి - సుజుకి, హిందూస్తాన్ యూనీలీవర్, నెస్లేఇండియా, బోష్, ఎబిబి ఇండియా. ఇవి ఐదూ కలిసి మాతృ కంపెనీలకు రూ.3979 కోట్లు రాయల్టీగా చెల్లించాయి. దీనిలో 2454 కోట్లు ఒక్క మారుతీ కంపెనీయే చెల్లించింది. అంతకు ముందు ఏడాదికంటే ఇది 36శాతం ఎక్కువ. ఈ ఏడాది రాయల్టీల చెల్లింపును పెంచేందుకు నిర్ణయించుకున్నట్లు ఈ కంపెనీలు ప్రకటించాయి. నెస్లేఇండియా అమ్మకాలలో 3.5 శాతం నుండి 4.5 శాతానికి రాయల్టీలను పెంచుతున్నట్లు, ఇక ముందు ప్రతి ఏడూ 0.2 శాతం లెక్కన పెంచుతాననీ ప్రకటించింది. హిందూస్తాన్ యూనిలీవర్ రాయల్టీలను 1.4 శాతం నుండి 3.5 శాతానికి పెంచినట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ ఐదు కంపెనీల అమ్మకాలూ, లాభాల పెరుగుదల కంటే రాయల్టీల చెల్లింపు పెరుగుదల అధికంగా వుంది.

కీలకమైన సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి లేకపోయినప్పటికీ రాయల్టీల పేరిట అధిక మొత్తాల చెల్లింపులు సాగుతున్నాయన్నది బహిరంగ రహస్యమే. ఈ తంతు ప్రభుత్వానికి తెలుసు. రాయల్టీల చెల్లింపు ఆందోళనకరంగా వున్నదని కేంద్రవాణిజ్య మంత్రిత్వశాఖ ఈనాడు అంటున్నదిగానీ, రాయల్టీలపై నిబంధనలను ఎత్తివేయమని 2009లో పట్టుపట్టి ఎత్తివేయించింది. తిరిగి నిబంధనలు పెట్టినా లేదా రాయల్టీ పై పన్ను విధించినా వచ్చే విపర్యాయాలనెదుర్కొనే శక్తిలేక ఆర్థికమంత్రిత్వశాఖ చూస్తూ కూర్చున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి రాయల్టీల చెల్లింపులు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో 20శాతాన్ని దాటిపోతాయి.

ద్రవ్య తరలింపులో మరొక అంశం, భారత కంపెనీలు చేస్తున్న విదేశీ వాణిజ్య రుణాలు. విదేశీ ద్రవ్యసంస్థలనుండి వాణిజ్య రుణాలు పొందటంపై ఆంక్షలు లేకుండా ప్రభుత్వం వెనువెంటనే అనుమతిస్తుంది. భారత బ్యాంకులకంటే వడ్డీరేటు తక్కువగా వుండటంతో భారత కంపెనీలు విదేశీ వాణిజ్య రుణాలు తీసుకోవటం పెరిగిపోయింది. ఇవి చేసిన రుణాలూ, వాటికి తిరిగి చెల్లింపులూ పెరిగిపోతూ మోయలేని భారమయ్యాయి.

యుపిఏ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విదేశీ వాణిజ్య రుణాలను ఆటోమాటిక్‌గా అనుమతించే విధానాన్ని చేపట్టింది. దీనితో భారత కంపెనీలు చేసిన విదేశీ వాణిజ్య రుణాలు 2009-10లో 2063 కోట్ల డాలర్లనుండి, 2011-12 నాటికి 3535 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇదే కాలంలో మొత్తం విదేశీ వాణిజ్య రుణాలు 7072 కోట్ల డాలర్లనుండి 12,089 కోట్ల డాలర్లకు పెరిగింది. పాత అప్పులకు తిరిగి చెల్లింపు కిస్తీలు(అసలులో కొంత వడ్డీ కలిపి) 1474 నుండి 2519 కోట్ల డాలర్లకు చేరింది. ఈ చెల్లింపులు కొత్తగా చేస్తున్న వాణిజ్య రుణాలలో 75 నుండి 80శాతం వరకూ వుంటున్నది. ఉదాహరణకు 2012-13 ఏడాదికే తీసుకుంటే 3202 కోట్లడాలర్ల విదేశీ వాణిజ్యరుణాలకు అనుమతినివ్వగా, 2549 కోట్ల డాలర్లు ఆ ఏడాదిలో చేరాయి. కాగా పాతరుణంలో అసలుకు 1692, వడ్డీగా 631 కోట్ల డాలర్లు (మొత్తం 2322 కో.డా) చెల్లించగా, మిగిలినది 227 కోట్ల డాలర్లే. చేసిన ప్రతి 10డాలర్ల అప్పులో 9 డాలర్లు పాత అప్పుతీర్చారు. అంటే పాత అప్పులు తీర్చేందుకు కొత్త అప్పులు చెయ్యాల్సిన దుస్థితిలో పడింది. ఈ రెండు పద్దులనే చూసినా, దేశంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడులకంటే దేశంనుండి తరలి పోతున్న పెట్టుబడే అధికమని స్పష్టమౌతున్నది.

కాగా ఇదంతా చట్టపరిధిలో సాగుతున్న తరలింపు. చట్టం కళ్లుగప్పి దేశంనుండి తరలిపోతున్న సంపద లెక్కకు అందనిస్థాయికి పెరిగిపోతున్నది. ప్రపంచ ద్రవ్య సమగ్రత (జి.ఎఫ్.ఐ) అన్న సంస్థ అంచనా ప్రకారం 2002 నుండి 2011 వరకూ భారత్‌నుండి విదేశాలకు చట్టవిరుద్ధంగా తరలించిన సొమ్ము 34,304 కోట్ల డాలర్లు (అంటే మొత్తం విదేశీ వాణిజ్య రుణాలకు మూడు రెట్లు ఎక్కువ). ఒక్క 2011లో తరలించినదే 8493 కోట్ల డాలర్లు (అంటే 2011 నాటికి పేరుకుపోయిన విదేశీ వాణిజ్య రుణాలకు దాదాపు సమానం). విదేశాలకు ఎగుమతి, వాటినుండి దిగుమతి సాగుతున్న సరుకుల ధరలను తప్పుగా పేర్కొనటంద్వారా బడాబూర్జువాలు, బడా వాణిజ్య వేత్తలు దేశంనుండి అక్రమంగా నిధులు తరలిస్తున్నారు. మొత్తం అక్రమ తరలింపులో 79శాతం ఈ పద్ధతిలో సాగుతున్నదని జిఎఫ్ఐ నిర్ధారించింది. ఇంతేకాక విదేశీ రుణాలు, సహాయం వాటిద్వారా కూడా నిధుల తరలింపు సాగుతున్నది.

మొత్తం 150 అభివృద్ధి చెందుతున్న దేశాల వివరాలను పరిశీలించిన జిఎఫ్ఐ 2011సంవత్సరంలో ఈ దేశాలనుండి సంపన్న దేశాలకు అక్రమంగా తరలించిన నిధులు 94,670 కోట్ల డాలర్లుగా వుందని తేల్చింది. ప్రతి ఏడాది సగటున లక్షకోట్ల డాలర్లు పేద దేశాలనుండి ధనిక దేశాలకు తరలిపోతున్నదని తేల్చిచెప్పింది. ధనిక దేశాల నుండి పేద దేశాలకు అందుతున్న అభివృద్ధి సహాయమనేదానికంటే 10 రెట్లు ఎక్కువగా అక్రమ నిధుల తరలింపు వుందని పేర్కొంది. (బిజినెస్ స్టాండర్డు 13-12-2013)

"విదేశీ పెట్టుబడి మౌలికంగా దేశ వ్యతిరేక మైనదిగా వుంటుంది. జాతీయ పెట్టుబడిని అణచివేసి, దానిస్థానంలో తిష్టవేసుకు కూర్చుంటుంది. వెనుకబడిన దేశాల జాతీయ పెట్టుబడిని ముంచెత్తి అణచి వేయటానికే విదేశీపెట్టుబడి వస్తుందనీ, తనే యజమాని అవుతుందనీ అన్నిదేశాల చరిత్ర చాటిచెప్పింది. తానీ దేశాలలో కొల్లగొట్టిన విపరీత లాభాలలో కొంత భాగాన్ని మరింత దోపిడీ చేయటానికి తిరిగి పెట్టుబడి పెట్టడం ద్వారా, లాభాల తరలింపు అంతమంటూలేని ప్రక్రియగా విస్తరించుకుంటూ పోతుంది. మరింతగా దోపిడీని శాశ్వతం చేస్తుంది. మనదేశాన్ని బలమైన, శక్తివంతమైన, స్వతంత్ర దేశంగా పునర్నిర్మించాలంటే విదేశీ పెట్టుబడిని పూర్తిగా స్వాధీనం చేసుకోవటం మినహా మరో మార్గం లేదు". **(కా॥ టి.ఎన్. "తాకట్టులో భారతదేశం" పేజీ 288)** ✡

**విదేశీ వాణిజ్య రుణాలు (కోట్ల డాలర్లలో)**

| సంవత్సరం | అనుమతి | వితరణ | అసలు కిస్తీ | వడ్డీ | తిరిగి చెల్లింపు మొత్తం | పేరుకున్న మొత్తం |
|---|---|---|---|---|---|---|
| 2008-09 | 1570 | 1322 | 658 | 397 | 1054 | 6246 |
| 2009-10 | 2063 | 1403 | 1149 | 324 | 1474 | 7072 |
| 2010-11 | 2521 | 2228 | 1045 | 351 | 1395 | 8848 |
| 2011-12 | 3535 | 2892 | 1978 | 542 | 2519 | 10478 |
| 2012-13 | 3202 | 2549 | 1692 | 631 | 2322 | 12089 |

ఆధారం : రిజర్వుబ్యాంకు బులెటిన్ 2013 సెప్టెంబర్

# దేశంలోని పరిశ్రమలను నిశ్శబ్దంగా కబళిస్తున్న జపాన్ సామ్రాజ్యవాదం

**దేశంలోని** అనేక పరిశ్రమలను నిశ్శబ్దంగా కబళించివేసే జపాన్ గుత్తసంస్థల సంఖ్య పెరుగుతోంది. 2013 సం॥లో - పాక్షికంగాగానీ, పూర్తిగాకానీ జపాన్ సామ్రాజ్యవాద పరిశ్రమలు కబళించిన భారత పరిశ్రమల సంఖ్య 16. కాగా ఈ పరిశ్రమల విలువ 346.52 మిలియన్ డాలర్లు. 2012 సం॥లో ఈ విధంగా జపాన్ సామ్రాజ్యవాదులు 'టేకోవర్' చేసిన పరిశ్రమల విలువ 385.5 మిలియన్ డాలర్లు. మౌలిక వసతుల కల్పన, వినియోగ వస్తువుల తయారీ, ఆర్థికసేవలు, రసాయనాలు, వస్తూత్పత్తి మరియు సాంకేతికరంగాల లోని భారత కంపెనీలను కొనుగోలు చేయటంలో జపాన్ కంపెనీలు చురుగ్గా వున్నాయి.

2009 - 13 సం॥ల మధ్యకాలంలో 1305 మిలియన్ డాలర్లపైగా విలువచేసే 52 కంపెనీలను జపాన్ దేశ గుత్తసంస్థలు కొనుగోలుచేశాయని లభిస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

భారత పరిశ్రమలలో వాటాలపై అదుపు ద్వారా ఆయా పరిశ్రమలపై యాజమాన్య హక్కు కలిగి వుండటానికి, ప్రభుత్వంతో, కార్మికులతో ముడిబడిన సమస్యలనన్నీ తమ భారత కంపెనీల భాగస్వాములే పరిష్కరించే పద్ధతికి జపాను గుత్తపరిశ్రమలు ఆసక్తి చూపుతున్నాయి.

'జపాన్ విదేశీ వాణిజ్యసంస్థ' అనే ఓ స్వతంత్ర ప్రభుత్వ ఏజన్సీ సమాచారం ప్రకారం, 2013 ప్రారంభం నుండీ భారతదేశపు 'లుక్ వెస్ట్' విధానంలో భాగంగా భారతదేశంలో జపాను పెట్టుబడుల వేగం పెరిగింది. భారతదేశం గుండా మధ్యప్రాచ్యం మరియు ఆఫ్రికా దేశాలలోకి పశ్చిమదేశాల మార్కెట్లను విస్తరింప జేయటమే 'లుక్ వెస్ట్' విధాన ఉద్దేశ్యం. భౌగోళిక సామీప్యం, భారతీయతరహా మార్కెటువ్యవస్థ, అన్నింటికీ మించి చౌకగా లభించే ముడిసరుకులు, శ్రమశక్తి వంటి అనేక సౌలభ్యాలు ఇమిడి ఉండటమే దీనికి కారణం!

**2013 సం॥లో అతిపెద్ద ఒప్పందాలు**

| కంపెనీ | రంగం | నగరం | కొనుగోలు చేసింది | మొత్తం (మి॥ డాలర్లలో) |
|---|---|---|---|---|
| విజయ్ ఎలక్ట్రికల్స్ | విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు | హైదరాబాద్ | తోషిబా | 200 |
| మల్టీప్యాక్ సిస్టమ్ | ప్యాకేజింగ్స్ | వదోదర | ఒమోరి | 31.9 |
| షాంటన్ ఫేజ్ ఇండియా | హెచ్‌ఆర్ సర్వీసెస్ | చెన్నై | రిక్రూట్ హోల్టింగ్స్ | 24.8 |
| భోరుకా అల్యూమినియం | అల్యూమినియం వెలికితీత | మైసూర్ | వైకెకెఏపి | 22.9 |
| ఎలెన్‌బ్యారే ఇండస్ట్రియల్ గ్యాసెస్ | ఆక్సిజన్ నైట్రోజన్ | కోల్‌కత | ఎయిర్‌వాటర్ | 17.63 |

ఆధారం : బిజినెస్ స్టాండర్డ్ 19-12-13

**జపాన్ స్వంతంజేసుకున్న కంపెనీల వివరాలు (2009-13)**

| నగరం | కంపెనీల సంఖ్య | మొత్తం విలువ (మి॥ డాలర్లలో) |
|---|---|---|
| ముంబయి | 16 | 421 |
| బెంగుళూరు | 4 | 81 |
| ఢిల్లీ | 6 | 44 |
| గుర్‌గావ్ | 4 | 32 |
| నోయిడా | 1 | 12 |
| కోల్‌కతా | 6 | 156 |
| అహమ్మదాబాద్ | 2 | 224 |
| చెన్నై | 3 | 25 |
| హైదరాబాద్ | 1 | 200 |
| పూనే | 2 | - |
| ఇతరములు | 7 | 104 |
| **మొత్తం** | **52** | **1305** |

---

È మెడళ్ళలో దట్టిస్తున్నది. మణిపూర్ స్వాతంత్ర్య సమరయోధురాలు గెయిడిన్ లియూ 16సం॥ల ప్రాయంలోనే బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని వీరోచిత పోరాటం సల్పింది. 1932 అక్టోబర్ 17న బ్రిటీష్ ప్రభుత్వం ఆమెపై రాజద్రోహ నేరం మోపి, ఆమెను అరెస్టు చేసి జీవితఖైదు విధించింది. 16సం॥ల జైలుజీవితం అనంతరం ఆమె విడుదలైంది. జాతీయోద్యమకాలంలో బ్రిటీష్ పాలకులపై వీరోచితంగా పోరాడి అమరులైన, దుర్భర కారాగార శిక్షలనుభవించిన ఇలాంటి ఈశాన్యప్రాంతవాసుల దేశభక్తియుత, వీరోచిత గాధలకు చరిత్ర పాఠ్య పుస్తకాలలో చోటు కల్పించటం లేదు. బహుళజాతుల, భిన్న సంస్కృతుల, వివిధ ఆచార సాంప్రదాయాలను, వేషం, భాష, ఆహార అలవాట్లను అన్ని ప్రాంతాలవారికి పరిచయం చేసి, అందరూ కలిసిమెలసి జీవించాలనే భావాలను విద్యావిధానం అందించటంలేదు. ఫలితంగా ఉన్నత చదువులు అభ్యసిస్తున్నప్పటికీ, అనేకమంది తమ తోటివారితో వ్యవహరిస్తున్న తీరు అత్యంత అభ్యంతరకరంగా వుంటున్నది.

ఆస్ట్రేలియాలో లేదా అమెరికాలో భారతీయ విద్యార్థులు లేదా ఉద్యోగులపై జరిగిన దాడిని జాతిపరమైన వివక్షగా పేర్కొంటూ ఖండించగలుగు తున్నవారు కూడా, దేశంలో-మన కళ్ళ ఎదురుగా మనదేశ పౌరులపైనే సాగుతున్న వివిధ రకాల వివక్షలు, అసమానతలు, అత్యాచారాలు, దాడులను ఖండించలేక పోతున్నారు.

న్యూఢిల్లీలో ఈశాన్య భారత పౌరులపై, పెచ్చు మీరుతున్న దాడులను ఈ నేపధ్యంలో పరిశీలించాలి. వారిపై దాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయటంతోపాటు దేశంలో పెచ్చుమీరుతున్న వివిధరకాల వివక్షలు, ఉన్మాదాలు, దాడులకు కారణమవుతున్న పాలకుల విధానాలపై సమైక్యంగా ఉద్యమించాలి. ఈశాన్య ప్రాంతవాసులు ఏనాటి నుండో డిమాండ్ చేస్తున్న ఏఎఫ్ఎస్‌పిఏ వంటి చట్టాల రద్దు; జాతిపరమైన వివక్షను నిరోధించే చట్టాలను రూపొందించటంతోపాటుగా, ఈశాన్యప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఉద్యమించాలి. దేశ ప్రధాన భూభాగంలోని ప్రజానీకం, ప్రజాస్వామికవాదులు, మేధావులు, కమ్యూనిస్టులు, విప్లవకారులంతా అల్ప సంఖ్యాక జాతులపట్ల వివక్షను, వారిపై సాగుతున్న దాడులను, అత్యాచారాలను ఖండిస్తూ, ఆ ప్రాంత ప్రజలకు సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించాలి. ✡

# కాశ్మీర్ సైన్యం సాగించిన బూటకపు ఎదురుకాల్పుల దురాగతం వెల్లడి

**ఎట్టకేలకు,** 2010 ఏప్రిల్ 30న, జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని సరిహద్దు జిల్లా అయిన కుప్‌వారాలోని మ్యాచిహిల్ సెక్టారులో ముగ్గురు అమాయక యువకుల మృతికి కారణమైన, భారతసైన్యం జరిపిన 'ఎన్‌కౌంటర్' బూటకమైనదని సైన్యం అంగీకరించవలసి వచ్చింది. నిరాయుధులైన ముగ్గురు యువకులను నిలువునా కాల్చిచంపిన ఈ బూటకపు ఎన్‌కౌంటర్ నిర్వహించిన రాజపుట్ రెజిమెంట్‌కు చెందిన ఓ కల్నల్, ఓ మేజర్‌తో సహా ఆరుగురు సైనికులపై కోర్టు మార్షల్ జరప వలసిందిగా సైనికాధికారులు ఆదేశించాల్సి వచ్చింది. ముగ్గురు యువకులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో సైనికులు పట్టుకుని కాల్చిచంపారని ఈ సంఘటన జరిగిన నాటినుండీ జమ్మూకాశ్మీర్ రాష్ట్ర ప్రజానీకం చెపుతూ వస్తున్న అంశాన్నే సైనికాధికారులు తమ సుదీర్ఘ విచారణలో ధృవీకరించారు.

ఉత్తర కాశ్మీర్‌లోని నాదిహాల్, బారాముల్లాకు చెందిన షాజాద్ అహమ్మద్ ఖాన్, రియాజ్ అహమ్మద్ మరియు మహమ్మద్ షఫీలకు ఉద్యోగాలు కల్పిస్తామనే ఆశచూపి, "చొరబాటుదారుల వ్యతిరేక సైనికదళాలు" తీసుకువెళ్ళి, వారిని కాల్చిచంపి పాకిస్థాన్ చొరబాటు దారులుగా వారిని చిత్రీకరించాయి.

ఈ యువకులను తమకు అప్పగించినందుకు గాను ఈ "చొరబాటుదారుల వ్యతిరేక సైనికదళాల"కు ఒక సైనిక విభాగం నుండి కొంత డబ్బు ముట్టజెప్ప బడింది. ఆపై రాజ్‌పుట్ రెజిమెంట్‌కు చెందిన సైనికులు వీరిని హతమార్చి 'మిలిటెంట్ల'ను నిర్మూలించినందుకు గానూ పై అధికారుల నుండి నగదు బహుమతులను అందుకున్నారు.

కాగా, ఆ ఎన్‌కౌంటరు బూటకమైనదిగా ఈనాడు సైనికాధికారులు అంగీకరించటమనేది సులభంగా మాత్రం జరగలేదు. ఇది – సైనికుల ఆత్మశోధన ద్వారా అంగీకరించినదీ కాదు లేదా, చెడునడత పట్ల పశ్చాత్తాపంతో ముందుకొచ్చినదీ కాదు. కాకపోగా, దీనికి భిన్నంగా జమ్మూకాశ్మీర్ రాష్ట్ర ప్రజానీకం – 124 మంది ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయి, 2,600మంది ప్రజలు తీవ్రగాయాలపాలై–సుదీర్ఘకాలం పాటు ఈ బూటకపు ఎన్‌కౌంటరుకు పాల్పడిన దోషులను శిక్షించాలని డిమాండ్‌చేస్తూ సాగించిన ప్రజా ఆందోళన ఫలితంగానే సాధ్యమైంది.

2000 సం॥లో జరిపిన పత్రిభల్ బూటకపు ఎన్‌కౌంటర్ నాటినుండి సైనికులపై వస్తున్న ఆరోపణలను, దూషణలను సైన్యం ఏమాత్రం లెక్కచేయక ప్రక్కకు నెట్టివేస్తూ వస్తున్నది. ఈ క్రమంలోనే అమాయకులైన యువకులను సైనిక బలగాలలోనే కొందరు హత్యగావిస్తూ, ఉగ్రవాదులతో జరిగిన ఎదురుబొదురు కాల్పులలో వారు మృతిచెందినట్లుగా చిత్రీకరించి, పై అధికారుల నుండి ప్రోత్సాహకాలు, ఉన్నత పదవులు, బహుమతులను అందుకొంటున్నారనే విశ్వసనీయమైన ఫిర్యాదులను కూడా సైనికాధికారులు అదేవిధంగా నిరాకరించి, ఆలస్యంచేసి, ఆ ఆరోపణలపై ఎలాంటి దర్యాప్తునూ కొనసాగించదలుచుకోలేదు.

జమ్మూకాశ్మీర్‌లోని సైనిక బలగాలకు 'సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం' (ఏఎఫ్ఎస్‌పిఏ) ద్వారా చట్టభీతిలేని విశేషాధికారాలను కట్టబెట్టారు. దీనికి తోడుగా మిలిటెంట్లను హతమారిస్తే ప్రోత్సాహకాలు, నగదు బహుమతులను కూడా అందచేస్తున్నారు. చట్టభీతి లేకపోవటంతోపాటు, ఈ రకమైన ప్రలోభాలు, ప్రోత్సాహకాలు – అమాయక ప్రజలను పట్టుకొని తీసుకువెళ్ళి కాల్చిచంపి మిలిటెంట్లుగా ప్రకటించటానికి సైనికులకు మరిన్ని అవకాశాలు కల్పించాయి.

కాశ్మీరు లోయలో సైన్యం నిర్వహించే ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్స్‌ను, "నక్సలైట్ల"ను హతమార్చే ప్రత్యేక బలగాల కార్యక్రమాలతో అనుసంధానం చేసి దాని అనుకరణగా మనదేశంలోని వివిధ రాష్ట్రాలలో ఈవిధమైన "ఎన్‌కౌంటర్ హత్యలు" సాగిస్తున్నారు. ఈ రకపు బూటకపు ఎదురుకాల్పులకు పాల్పడిన పోలీసులకు చట్టాలకు లోబడవలసిన అవసరమే లేకుండా వారిని యదేచ్ఛగా వదలివేయటంతోపాటు, ప్రభుత్వాల నుండి ప్రోత్సాహకాలు, ఉన్నత పదవులు పొందగలుగుతున్నారు.

జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని ప్రధానస్రవంతి రాజకీయ పార్టీలు, జమ్మూకాశ్మీర్ ప్రజలు – జమ్మూ కాశ్మీర్ నుండి సైన్యం వైదొలగాలని, సైనికాధికారులకు అపరిమిత అధికారాలను కట్టబెడ్తున్న, సైనికులకు రక్షణనిస్తున్న సైనికదళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఏఎఫ్ఎస్‌పిఏ) రద్దుచేయాలనే నిలకడైన డిమాండ్లతో సాగించిన, ప్రజలనుండి పెల్లుబికిన భారీ ప్రజా ఆందోళనల ఫలితంగా 2010 ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమైనదని అంగీకరించక, అందుకు పాల్పడిన సైనికులపై, అధికారులపై కోర్టుమార్షల్ నిర్వహించేందుకు ఆదేశించక సైనికాధికారులకు మరో గత్యంతరం లేకపోయింది. తద్వారా తాము ఓ నిజాయితీగల వ్యవస్థగా చూపుకునేందుకు తమ ప్రతిష్టను కాపాడుకునే ఉద్దేశ్యంతోనే ఈ చర్యకైనా సిద్ధపడ్డారు. అదే సమయంలో జమ్మూకాశ్మీర్ నుండి సైన్యాన్ని ఉపసంహరించుకునేందుకు గానీ, ఏఎఫ్ఎస్‌పిఏను కనీసం పాక్షికంగా కొన్ని జిల్లాల నుండి మినహాయించాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను ఆమోదించేందుకుగానీ సైన్యం, కేంద్రప్రభుత్వం సిద్ధంగా లేవు.

ఒక ప్రయోగాత్మక ప్రాతిపదికపై రాష్ట్రంలోని రెండు లేదా మూడు జిల్లాలలో ఏఎఫ్ఎస్‌పిఏను వెనక్కు తీసుకోవాలన్న ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వ కనీసపాటి సూచనను కూడా శ్రీనగర్ స్థావర ప్రాంతంలోని యూనిఫైడ్ కమాండ్ బలగాలతోసహా వివిధ స్థాయిల లోని సైనికబలగాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

2014 నాటికి ఆఫ్ఘనిస్తాన్‌గుండా కాశ్మీర్‌లోకి ఉగ్రవాద సంస్థలు దృష్టిసారించబోతున్న ఈ కీలకమైన తరుణంలో ఏఎఫ్ఎస్‌పిఏను ఉపసంహరించుకుంటే, అది కాశ్మీరు లోయలో విధులు నిర్వహిస్తున్న సైనిక బలగాల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుందని ప్రభుత్వ సైనిక నిఘా విభాగాలు వాదన చేస్తున్నాయి. అంతేగాక, రాష్ట్రంలో సైనిక విభాగాలు ఎన్నో విజయాల్ని సాధించ గలుగుతున్నాయంటే కూడా, అదంతా ఏఎఫ్ఎస్‌పిఏ కారణంగానేనని వారు చెప్పుకొస్తున్నారు.

సైన్యం, రక్షణ బలగాల, నిఘా విభాగాల ఈ వాదనలపై ఆధారపడి కేంద్రప్రభుత్వం 2014 చివరి దాకా జమ్మూకాశ్మీర్ రాష్ట్రం నుండి ఎఎఫ్ఎస్‌పిఏను ఉపసంహరించుకోరాదని నిర్ణయించింది. అదికూడా, 2014లో ఆఫ్ఘనిస్తాన్ నుండి అంతర్జాతీయ బలగాలు ఉపసంహరణ వరకూ వేచిచూసి, దాని ప్రభావం కాశ్మీర్‌పై ఎలా ఉంటుందో గమనించుకొన్న తర్వాతనే కాశ్మీర్‌కు సంబంధించిన ఏ నిర్ణయమైనా తీసుకోవటం జరుగుతుందని తేల్చి చెప్పింది.

ఈ విధంగా సైన్యం మరియు భారత "ప్రజాస్వామ్య" ప్రభుత్వం జమ్మూకాశ్మీర్ భవితవ్యాన్ని – అమెరికా సామ్రాజ్యవాదుల అదుపులోనున్న ఆఫ్ఘనిస్థాన్‌తో ముడిపెట్టారు.

కనుక, 2010లో సైన్యం జరిపిన బూటకపు ఎన్‌కౌంటరు కేసులో సైన్యం నిర్వహించే సైనిక న్యాయస్థానంలో ఫలితం ఎలా ఉండబోతుందనే దానితో నిమిత్తం లేకుండా, సైన్యానికి చట్టభీతిలేని విశేషాధికారాలను ఏఎఫ్ఎస్‌పిఏ ద్వారా కొనసాగిస్తుంది. ఆ విధంగా మరిన్ని బూటకపు ఎన్‌కౌంటర్లు నిర్భీతిగా కొనసాగేందుకూ అవకాశం కల్పిస్తుంది.

ఏఎఫ్ఎస్‌పిఏ మరియు బూటకపు ఎన్‌కౌంటర్ల ప్రమాదం జమ్మూకాశ్మీర్‌కు మాత్రమే పరిమితమైలేదు. సైనికబలగాలు చెప్తున్న దాని ప్రకారమే ఆఫ్ఘనిస్తాన్ నుండి అంతర్జాతీయ సైనికబలగాల ఉపసంహరణతో ముడిపడిలేని మణిపూర్, అస్సామ్ మొదలైన ఈశాన్య రాష్ట్రాలలోనూ ఇది కొనసాగుతున్న పెనుప్రమాదంగా వుంది.

ప్రజాస్వామిక ప్రభుత్వం, ప్రజా పాలనలను అపహాస్యం చేయటం తప్ప ఇది మరోటికాదు. ప్రజాస్వామ్య పాలన మేలిముసుగులో సాగిస్తున్న సైనికపాలన మినహా ఇది వేరుకాదు. దీనినే దేశవ్యాపితంగా విస్తరించి కొనసాగిస్తున్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలకు; సైన్యానికి, పోలీసులకు అపరిమిత అధికారాలు కట్టబెట్టడానికి వ్యతిరేకంగా నిలకడైన, నిరంతరాయ ప్రజాఉద్యమం మాత్రమే, ప్రజలను ఈ ప్రమాదం నుండి రక్షించ గలుగుతుంది. జమ్మూకాశ్మీర్‌లో ఏఎఫ్ఎస్‌పిఏ రద్దుకు, బూటకపు ఎన్‌కౌంటర్ల అంతానికి దేశవ్యాపిత ఉద్యమ నిర్మాణం తక్షణ కర్తవ్యంగా వుంది. **26-1-14** ✡

# ప్రభుత్వ వైద్యసేవల పునరుద్ధరణ కోసం సాగుతున్న ఆందోళన

**నెల్లూరుజిల్లా** వెంకటగిరి పట్టణంలో బ్రిటిష్ పాలనాకాలంనుండి ప్రభుత్వాసుపత్రి, ప్రసూతి (ఘోషా) ఆసుపత్రి రెండూ ప్రజలకు వైద్య సేవలందజేస్తూ వస్తున్నాయి. 1922లో వెంకటగిరి జమిందారులు ఈ ఘోషా ఆసుపత్రిని నిర్మించారు. 7 ఎకరాల విస్తీర్ణంలో కోటలను తలపించేరీతిలో పురుషుల విభాగానికి, మాతాశిశు రక్షణ విభాగానికి, కంటివైద్యానికి వేర్వేరు భవనాలు వున్నాయి. 1966 నుండి ఈ ఘోషా ఆసుపత్రిని ప్రభుత్వానికి బదలాయించారు.

కాగా, మూడు మండలాలకు కేంద్రంగా ఉన్న వెంకటగిరి పట్టణంలోని ఘోషా ఆసుపత్రిని నాలుగేళ్ళ క్రితం ప్రభుత్వం మూసివేసింది. ఇక, కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో (ప్రభుత్వ ఆసుపత్రిలో) 8 మంది వైద్యులకు గానూ ఇద్దరేవున్నారు. స్వీపర్లు, తోటీలు అసలే లేరు. ఎక్సరేప్లాంటూ లేదు; దాని సిబ్బంది లేరు. ల్యాబ్ టెక్నీషియన్స్ లేరు. మొత్తంగా 30 పోస్టులకుగానూ 20 ఖాళీగా వున్నాయి.

వెంకటగిరి పరిసర ప్రాంతాలలోని డక్కిలి, బాలాయపల్లి, నాయుడుపేటలతోపాటు పక్కనేవున్న సరిహద్దు ప్రాంత చిత్తూరు జిల్లా ప్రజానీకానికి విస్తృత వైద్యసేవలందించే ఈ ఆసుపత్రులలో ఒకటి మూత వేయబడగా, మరొకటి అధ్వాన్న స్థితిలో కొనసాగు తోంది. దీనితో వేలాదిమంది ప్రజానీకం స్థానికంగావున్న ప్రైవేటు వైద్యుల దగ్గరకో, తిరుపతి, నెల్లూరులలోని కార్పొరేటు ఆసుపత్రులకో వెళ్ళాల్సివస్తోంది. కార్పొరేటు ఆసుపత్రుల విచ్చలవిడిదోపిడీతో వైద్యావసరాలకు ప్రజలు తమ ఆస్తులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది.

ఈ నేపథ్యంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర) వెంకటగిరిశాఖ ఈ ఆసుపత్రుల పనితీరుపై పరిశీలన జరిపి, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను కరపత్రంద్వారా వెలుగులోకి తెచ్చింది. ఈ సమస్యపై స్పందించిన వెంకటగిరి పట్టణం లోని న్యాయవాదులు, విశ్రాంత ఉద్యోగులు, వైద్యులు, ప్రజాస్వామికవాదులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పౌరసమితిగా ఏర్పడి ఆందోళనా కార్యక్రమం చేపట్టారు.

మూతవేసిన ఘోషా ఆసుపత్రిని తిరిగి తెరచి, ప్రజలకు వైద్య సేవలందించాలని, ప్రభుత్వాసుపత్రిలో ఖాళీల భర్తీతోపాటు, వసతులు మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ 2013 డిసెంబర్ 4న స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. డిసెంబర్ 11న పౌరసమితి కన్వీనర్ ఎమ్‌విఎస్ గిరిజాకుమారి ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం జిల్లా కలెక్టరును కలసిసమస్యలను వివరించింది.

మూతవేయబడటంతో చిట్టడవిలా తయారైన ఘోషాసుపత్రిఆవరణను శుభ్రం చేసేందుకు పౌరసమితి ఇచ్చిన పిలుపు మేరకు, డిసెంబరు 16 నుండి రోజుకో కళాశాల విద్యార్థుల చొప్పున పాల్గొని 10 రోజులలో ఆసుపత్రిలోని 40 శాతం విస్తీర్ణంలోని పిచ్చిమొక్కలు, కలపను తొలగించి శుభ్రంచేశారు. ఈ కృషిలో విశ్రాంత ఉద్యోగులు, న్యాయవాదులు కూడా భాగం పంచుకున్నారు.

ఆసుపత్రిలో వైద్యసేవలందించాలనే పౌరసమితి పిలుపుమేరకు డిసెంబర్ 18న ఆసుపత్రి ఆవరణలో సభ నిర్వహించి, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఐదుగురు వైద్యులతో ప్రజలకు వైద్యసేవలందించటం ప్రారంభించి 20 రోజులపాటు నిరంతరాయంగా కొనసాగించారు. డిసెంబర్ 29న పదిమంది వైద్యులతో శిబిరం నిర్వహించారు. ఈ కాలమంతటా ఉచితంగా మందులు కూడా పంపిణీచేశారు.

ఈ క్రమంలోనే డిసెంబరు 23న వెంకటగిరి పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. డిసెంబర్ 28న తహసిల్‌దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అదేరోజు వెంకటగిరి వచ్చిన ట్రైనీ కలెక్టర్, ఆర్‌డిఓలను కలిసి పౌరసమితి బృందం వినతిపత్రం అందజేసింది. ట్రెయినీ కలెక్టర్ ఆసుపత్రి భవనాలవద్దకు వచ్చి పరిశీలించి జిల్లా కలెక్టరుకు నివేదికనందజేశారు.

2014 జనవరి 5న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు, పట్టణ ప్రముఖులతో పౌరసమితి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. వీరందరి ఆధ్వర్యంలో మరోమారు జనవరి 9న తహశీలుదారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి, అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ ఆందోళనా కార్యక్రమాలన్నింటా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) చురుకైన భాగస్వామ్యంవహిస్తూ వస్తోంది. ఈ ఆందోళన కొనసాగుతోంది. ✡

# డ్రెయిన్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని ధర్నా

**బందరు, 21-1-14 :**

తుఫాన్లు, భారీ వర్షాలవల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోవడానికికారణమైన కృష్ణాజిల్లాలోని మేజర్, మీడియం, మైనర్ డ్రైన్లకు యుద్ధప్రాతిపదికన పూర్తిస్థాయిలో మరమ్మత్తులను పూర్తిచేయాలని డిమాండు చేస్తూ 27-1-2014 తేదీన మచిలీపట్నం జిల్లా కలక్టరు కార్యాలయం ఎదుట జిల్లాస్థాయి ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్రకార్యదర్శి కా॥ కొప్పుల కోటయ్య ప్రసంగిస్తూ అధ్వాన్నంగా వున్న డ్రైన్ల కారణంగానే తుఫాన్ల తర్వాత అనేక రోజులు పంట ముంపుకు గురై చేతికొచ్చిన పంటను రైతాంగం కోల్పోయి దివాళా తీశారని అస్తవ్యస్తంగా వున్న మురుగు కాల్వలు పాలకుల్లో, అధికారుల్లో, కాంట్రాక్టర్లలో తిష్టవేసిన నిర్లక్ష్యానికి, బాధ్యతా రాహిత్యానికి నిలువెత్తు సాక్ష్యంగా వున్నాయని, అందుకు ప్రభుత్వం బాధ్యత వహించ కుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని అన్నారు. ధర్నాలో పాల్గొని సంఘీభావం తెల్పిన రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎర్నేని నాగేంద్రనాథ్ ప్రసంగిస్తూ రైతు ప్రయోజనాలు కాపాడాలని, వ్యవసాయరంగాన్ని పరిరక్షించాలని రైతాంగం చాలాకాలంగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని, కృష్ణాడెల్టా ఆధునీకరణ పేరిట పంటల అభివృద్ధికి దోహదపడటం కంటే కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కల్సి అందిన కాడికి దిగమింగటమే లక్ష్యంగా కనపడు తోందని, ఇందుకు పెదలంక డ్రైన్ త్రవ్వకాల్లో జరిగిన అక్రమాలే నిదర్శనమని అన్నారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ ఎంత భారీవర్షాలు పడినా పొలాల్లో చుక్కనీరు నిల్వ వుండకుండా పటిష్టమైన మురుగు కాల్వల నిర్మాణం జిల్లాలో వుందని, దీనిపట్ల పాలకుల నిర్లక్ష్యం క్షంతవ్యంకాదన్నారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ కృష్ణాడెల్టా ఆధునీకరణ రైతులపై ప్రేమతో ప్రారంభించినది కాదని వరల్డ్‌బ్యాంకు ఆదేశానుసారం వ్యవసాయరంగంలో విదేశీ, స్వదేశీ బడా కంపెనీలు తిష్టవేసేందుకు అనువైన విధానపరమైన నిర్ణయాలు చేశారని, ఆధునీకరణ పూర్తికాగానే సాగునీటిని ప్రైవేటీకరించి పంట కాల్వలకు సాగునీటి మీటర్లు బిగించి సాగునీటి ఛార్జీలను వసూలు చేస్తారని చెపుతూ ఈ స్థితిలో రైతాంగం చైతన్యవంతులై సమైక్య ఆందోళనకు పూనుకోవాలన్నారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు కా॥ జె.జగన్, కా॥ పామర్తి అంజమ్మ ఈ ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. నవయువసమాఖ్య నాయకులు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెల్పారు. ధర్నాలో నాగాయలంక, చల్లపల్లి, చిన్నాపురం, జమీదింటకుర్రు, నందిగం, చినముత్తేవి, మచిలీపట్నం పరిసర గ్రామాల నుండి రైతులు, కౌలురైతులు, కూలీలు పాల్గొన్నారు. డ్రైన్ల తీరుతెన్నుల గురించి నిర్దిష్టంగా వ్రాసిన మెమోరాండంను జిల్లా కలెక్టరుకు జిల్లా ప్రతినిధి బృందం అందజేశారు. ధర్నాకు ముందుగా జిల్లాలో కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ✡

# ఒడిషా : భూమిసమస్య పరిష్కారానికై ప్రజా ప్రదర్శన - బహిరంగసభ

**భువనేశ్వర్, 21-1-14 :**

ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధ ఛాసి మూలియా సంఘ్(సిఎంస్) ఆధ్వర్యంలో ఒడిషా రాష్ట్రరాజధాని భువనేశ్వర్‌లో పలు ప్రజాసమస్యల పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ 21-1-14న ప్రదర్శన-బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందుగా జనవరి 20వ తేదీన ఏఐకెఎమ్‌కెఎస్, చాషీమూలియా సంఘ్ నాయకుల ప్రతినిధి బృందం గవర్నరును కలిసి డిమాండ్లతో కూడిన మెమోరాండం అందచేశారు. అదేవిధంగా రాష్ట్ర డిజిపిని కలిసి ఆదివాసుల ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనలను వివరించి - ప్రత్యేకించి కోరాపుట్ జిల్లా బందుగాం ప్రాంతం లోని ఆదివాసుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను డిమాండ్‌చేస్తూ మరో మెమోరాండం అందజేశారు.

జనవరి 21వ తేదీన రెండువేల మంది గ్రామీణ పేదలు, ఆదివాసులు, మత్స్యకారులు, దళితులు, మహిళలు ఇతరసెక్షన్ల ప్రజానీకం రాష్ట్రం లోని పలు జిల్లాల నుండి భువనేశ్వర్‌కు చేరుకొని, అక్కడ నుండి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎర్రజెండాలు, బ్యానర్లు, ప్లకార్డులు చేబూని ఉత్తేజకర నినాదాలు చేస్తూ భువనేశ్వర్ వీధులలో ప్రదర్శకులు కదంతొక్కారు. ప్రజాకళాకారులు డప్పు నృత్యాలతో, ఉద్యమగీతాలాలపిస్తూండగా, ఆదివాసీ కళాకారులు తమ సాంప్రదాయక నృత్యాలతో పుర ప్రజలను ఆకట్టుకున్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల దూరం సాగిన ప్రదర్శన అనంతరం, ప్రదర్శకులు బహిరంగసభాస్థలికి చేరుకున్నారు.

ఈ బహిరంగ సభకు కా॥ బసుదేవ్‌దాస్, కొండగొర్రి పైడమ్మ, సుశాంత్ జెనాలు అధ్యక్షత వహించారు. ఏఐకెఎమ్‌కెఎస్ కన్వీనర్ కా॥ సుబోధ్ మిత్రా; కో-కన్వీనర్ యస్.ఝూన్సి; పశ్చిమ ఒడిషా కృషక్ సమన్వయ సమితి నాయకులు శ్రీలింగరాజ్, ఛాసిములియా సంఘ్ నాయకులు కా॥ బ్రహ్మానంద మాలిక్; ఏఐకెఎమ్‌కెఎస్ నాయకులు శంభు మహతో; ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ గణేష్ పండ; ప్రజాస్వామికవాది ప్రశాంత్ పయిక్ర; పోస్కో వ్యతిరేక ఉద్యమ నాయకులు శ్రీతునా బరాల్; సిఎంఎస్ నాయకులు కా॥ శ్రీకాంత్ మొహంతి ఈ బహిరంగసభలో ప్రసంగించారు.




ప్రదర్శన ముందుభాగంలో కళాకారుల నృత్యాలు; బహిరంగసభా వేదికపై వక్తలు

ఉపన్యాసకులు - తమ ఉపన్యాసాలలో కేంద్రంలో, రాష్ట్రంలో పాలన సాగిస్తున్న ప్రభుత్వాలు భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తూ రావటమే ప్రజల సమస్యలకు మూలకారణమని వివరించారు. అదేవిధంగా ఈ దోపిడీ పాలకులు, పాలకవర్గాలు ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా వారిని ఎన్ని విధాలుగా మభ్యపరుస్తూ, ప్రక్కదోవ పట్టిస్తూ, అణచివేస్తూ వస్తున్నారో వివరించారు. అభివృద్ధి పేరిట పాలకులు అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలు ఏవిధంగా ప్రజలకు నష్టకరంగా పరిణమిస్తున్నాయో వివరించారు. ఈ నేపథ్యంలో ఐక్య ఉద్యమాలలోకి సంఘటితపడ వలసిన ఆవశ్యకతను గుర్తింపజేసి, పోరాడుతున్న ప్రజలమధ్య ఐక్యతను, సంఘీభావాన్ని పెంపొందిం చుకోవాలని పిలుపునిచ్చారు.

సీలింగ్ పరిమితికి మించిన మిగులు భూములన్నింటినీ భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని; ప్రభుత్వ భూములను ప్రజలకు పంపిణీ చేయటంతోపాటు ఇప్పటికే పేదల ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలివ్వాలని; కౌలుదారులు సాగుచేసుకుంటున్న భూములపై వారికే హక్కు కల్పించాలని; పూరీ జిల్లాలోని సిపానరుబాలి ప్రాంతంలో పేదల ఆధీనంలో భూములపై వారికే హక్కు కల్పించాలని; 2002 చట్టసవరణతోసహా 2/56 చట్టాన్ని ఖచ్చితంగా అమలుచేసి, ఆదివాసీ హక్కులను పరిరక్షించాలని; రైతులకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతుధరలకు మరో 500రూ. అదనంగా కల్పించాలని; ఫై-లిన్ తుఫాను, వరదలలో పంటనష్టానికి గురైన రైతులకు తిరిగి వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా తగిన పరిహారాన్ని, సహాయాన్ని అందించాలని ఉపన్యాసకులు డిమాండ్‌చేశారు.

ప్రజలను నిర్వాసితులనుగావించే, సహజ సంపదలను దోపిడీగావించే, ప్రజల జీవనోపాధిని విధ్వంసం చేసి పర్యావరణాన్ని విషతుల్యంగావించే అన్ని ప్రభుత్వ ఒప్పందాలను రద్దుచేయాలని; వ్యవసాయ కూలీలకు కనీస వేతనాన్ని 300రూ. గ్యారంటీచేయాలని; గ్రామీణ ఉపాధిహామీపథకంలో పనిదినాలకు సం॥రానికి రెండువందలకు పెంచటంతోపాటు వారి వేతనాన్ని రూ.300కు పెంచాలని; తీరప్రాంతంలో మత్స్యకారులు జీవించే హక్కును పరిరక్షించి, వారి హక్కుల ఉల్లంఘనలను నిరోధించాలని, ఫైలిన్ తుఫానులో వలలను, పడవలనుకోల్పోయినవారందరికీ వాటిని ఉచితంగా అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిపానరుబాలి ప్రాంతంలోను, కోరాపుట్, జగత్‌సింగపూర్ ప్రాంతాలలో తమ న్యాయమైన హక్కులకోసం పోరాడుతున్న ప్రజలపై బనాయించిన కేసులను ఎత్తివేయాలని; మహిళలకుభద్రత కల్పించ టంతోపాటు, వారిపై అత్యాచారాలకు పాల్పడిన దోషులపై సత్వరమే కఠినంగా చర్యలు తీసుకోవాలని; దళితులపై దాడులకు, అకృత్యాలకు పాల్పడేవారిపై కఠినచర్యలతోపాటుగా యస్.సి., యస్.టి అత్యాచార(నిరోధక)చట్టాన్ని సక్రమంగా అమలుచేయాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నోలియాసాహి, పూరి తదితర ప్రాంతాలలో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదలకు వారి నివాసప్రాంతాలపై హక్కు కల్పించటంతోపాటు, పట్టణప్రాంత భూమిలేని నిరుపేదలకు ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలని, ప్రజల ఆరోగ్యాన్ని వారి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వాతావరణాన్ని ధ్వంసంచేసే మద్యం వ్యాపారాన్ని అరికట్టాలని ఉపన్యాసకులు డిమాండ్ చేశారు.

ప్రజాకళాకారుల బృందాలు స్ఫూర్తిదాయక మైన ఉద్యమగీతాలతో సభకు హాజరైన ప్రజలకు ఉత్తేజాన్నిచ్చాయి.

ఈ ప్రదర్శన - సభలకు ముందుగా కరపత్రాలు, పోస్టర్లు, గోడవ్రాతలతో, డిమాండ్లతో విస్తృతంగా ప్రజలమధ్య ప్రచారకృషి జరిగింది. ✸

# బీహార్ : నగడి, బతానితొలా, లక్ష్మణ్‌పూర్‌బాతే, మియాంపూర్‌లలో దళితుల ఊచకోతపై పాట్నా హైకోర్టు తీర్పులపై నిరసన ప్రదర్శన

**పాట్నా, 25-1-14:**

నగడి, బతానితొలా, లక్ష్మణ్‌పూర్‌బాతే, మియాంపూర్‌లలో సాగిన ఊచకోతలపై పాట్నా హైకోర్టు వెలువరించిన వరుస తీర్పులు దిగ్భ్రాంతిని కలిగించాయి. న్యాయాన్ని కోరే ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు ఈ తీర్పులపై ఆగ్రహాన్ని, నిరసననూ వ్యక్తంచేశాయి. ఈ తీర్పులు మన న్యాయవ్యవస్థనే ప్రశ్నార్థకం చేశాయి. తగినంత సాక్ష్యంలేదు; పోలీసుడైరీ, కేసు డైరీలలో లోపాలున్నాయి; అసంగత, పరస్పరవిరుద్ధ అంశాలున్నాయి... మొదలగు కారణాలను చూపి ఈ ఊచకోత కేసుల్లో ముద్దాయిలను నిర్దోషులుగా హైకోర్టు విడిచిపుచ్చింది. కానీ ఊచకోత నేరస్తులను, హంతకులను పట్టుకుని కోర్టు ముందుకు తీసుకు రమ్మని హైకోర్టు ఆదేశించలేదు. రణబీర్‌సేనకు చెందిన హంతకులు అత్యంత పీడిత, పేద శ్రమజీవులను ఊచకోత కోశారు. 1996 జులై 11న బతానితొలాలో, 1997 డిసెంబరు 1న లక్ష్మణ్‌పూర్‌బాతేలో, 1998 మే 11న నగడిలో, 2000 జూన్ 16న మియాంపూర్‌లలో మారణకాండ సాగింది. ఆనాడు దేశవ్యాపితంగా ప్రజాస్వామిక, ప్రగతిశీల, విప్లవశక్తులు ఈ మారణకాండను ఖండించాయి. బాధిత కుటుంబాలకు మద్దతుగా నిలిచాయి. భూస్వామ్య భావజాలంతో నిండిన, ఈ మారణకాండ సాగించిన వారందరినీ (మియాంపూర్ కేసులో ఒక్క ముద్దాయికి యావజ్జీవశిక్ష విధించారు) విడిచి పెట్టింది. కారణం వారు చంపింది సామాజికంగా క్రింది వర్గాలకు చెందిన వారుకావటమే! హంతకులను రక్షించటంలో పోలీసులు తమ 'నిజాయితీ'నంతా చూపెట్టారు. నేరస్తులపై కేసులను బలహీనపరిచే పని పోలీసు వ్యవస్థ మొదటనుండీ చేసింది. కేసుడైరీలను కావాలనే లోపభూయిష్టం చేశారు. నేరస్తులను గుర్తించటం, సాక్ష్యాలను సేకరించటంలో నేరపూరిత నిర్లక్ష్యాన్ని అధికార యంత్రాంగం చూపింది. నిజానికి లాలూ-రబ్రీదేవి పాలన నాటినుండీ నితిష్‌కుమార్ పాలనవరకూ రణబీర్‌సేన, తదితర ముఠాల హంతకులను రక్షించటమే పనిగా సాగింది. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం దీనిలో భాగస్వామి. తనకు నచ్చిన కేసుల్లో చురుకుదనం చూపే న్యాయవ్యవస్థ ఈ కేసులపట్ల నిమ్మకు నీరెత్తినట్లుగా వుంది. పేదప్రజలపై ఊచకోత "అరుదైన కేసుల్లో కెల్లా అరుదైనది" వారికి కన్పించలేదు. పత్రికల్లోవచ్చి, తీవ్ర విమర్శలు రావటంతో ఢిల్లీలో జెస్సికాలాల్ కేసును తిరిగి ప్రారంభించిన సంగతి అందరికీ తెలిసినదే.

అసమానత్వం పునాదిగా సామాజికంగా విభజించబడిన వర్గ సమాజం మనది. ఒకవైపున పుంజీడుమంది ధనికులు - భూమి, ఆస్తులు, సంపదలు, వనరులపై ఆధిపత్యం కలిగివున్నారు. మరోవైపున కోట్లాది ప్రజలు దారిద్ర్యంలో వనరుల లేమిలో కూరుకుపోయి వున్నారు. 1970, 1980 దశాబ్దాలలో, బీహార్‌లో గ్రామీణ పేదలకు భూమి, తగిన వేతనాలు, గౌరవంపై న్యాయమైన శక్తివంతమైన పోరాటాలు సాగాయి. ఈ పోరాటాలు ప్రగతినిరోధక, భూస్వామ్య ధనిక వర్గాలకు నిద్ర పట్టకుండా చేశాయి. పీడిత, తాడిత శ్రమజీవులకు 'గుణపాఠం' నేర్పేందుకు అనేక ప్రైవేటు సేనలు పుట్టుకువచ్చాయి. అనేకసార్లు మారణకాండను సాగించి ఈ ప్రైవేటు సేనలు బీహారు నేలను రక్తసిక్తం చేశాయి. ఈ సేనలలో అత్యంత దుర్మార్గమైన నేరస్థ సేనే రణబీర్‌సేన! సన్‌లైట్‌సేన, కువార్‌సేన, లోరిక్ సేన, భూమి సేన, బ్రాహ్మిణిసేనవంటి సేనల పరంపరలో చివరిది రణబీర్‌సేన. ఇదొక్కటే డజనుకుపైగా మారణకాండలు సాగించింది.

దేశంలో చట్టబద్ధపాలన నామమాత్రంగానే వుంది. చట్టం ముందు అందరూ సమానులే అని చెబుతారు. వాస్తవానికి, పేదలకు న్యాయం చాలా అరుదు. కానీ ధనికులు మాత్రం శిక్షనుంచి తప్పించుకుంటారు. బీహార్‌లోని మారణకాండలనే చూస్తే, దలాల్‌ఛక్, బధోస్, బారా హత్యాకాండలలో నేరస్థులకు క్రిందికోర్టులు శిక్షలు విధిస్తే, సుప్రింకోర్టు వారిని విడిచిపెట్టింది. నగడి, లక్ష్మణ్‌పూర్‌బాతే, బతానితొలా హత్యాకాండలలో ప్రధాన నేరస్థ లందరినీ కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టింది.

మనదేశంలో ధనికులను కాపాడేందుకు పూనిక వహించి న్యాయవ్యవస్థను రూపొందించారని ఈ కేసులలో పాట్నా హైకోర్టు తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడ సుదీర్ఘ, సంక్లిష్ట న్యాయ ప్రక్రియలో ప్రారంభంలోనే పేదలకు స్థానం లేకుండా చేస్తారు. న్యాయమూర్తుల ఎంపికలో కూడా ఒక నిర్దిష్టవర్గానికి చెందిన, సామాజిక స్థాయికి చెందిన, కుటుంబ, రాజకీయ నేపథ్యం కీలకాంశంగా వుంటుంది. సామాన్యుల జీవన పోరాటాలనుండి వేరుపడివున్న ఈ న్యాయమూర్తులు తమ కుటుంబ, వర్గనేపథ్యంతో ప్రభావితులై వుంటారు. ఇవి వారిచ్చే తీర్పులలో ప్రతిబింబిస్తాయి. ఈ న్యాయమనబడేది వర్గన్యాయమే. అది సహజంగా ధనిక వర్గాలకు అనుకూలంగా, శ్రమజీవులకు వ్యతిరేకంగా వుంటుంది.

ఈ సంక్లిష్ట పరిస్థితిలో కూడా, బీహారులోని శ్రామికజనులు అనేక ప్రజాస్వామిక, ప్రగతిశీల, విప్లవకర సంస్థల ఆధ్వర్యంలో అణచివేతకూ, హింసకూ, రాజ్య నిర్బంధానికీ, ప్రైవేటు సేనల దౌర్జన్యాలకూ వ్యతిరేకంగా ప్రతిఘటన సాగిస్తున్నారు. ఈ కేసులలో పాట్నాహైకోర్టు యిచ్చిన అన్యాయమైన తీర్పులు వారి నైతిక ధృతిని సడలించలేవు. సామాన్య ప్రజల ఆకాంక్షలు, హక్కులు, పోరాటాలపై అత్యంత తీవ్రంగా ప్రగతినిరోధక శక్తులు దాడులు సాగిస్తున్న సమయంలో, న్యాయాన్ని కోరే ప్రజాస్వామిక, విప్లవశక్తులమధ్య ఐక్యత అత్యావశ్యకమైంది. పేదల పక్షాన సమైక్యంగా నిలచి, యధాతథస్థితికీ, ప్రగతినిరోధకత్వానికీ మూలమైన దోపిడీవర్గ పాలనను కూల్చేందుకు పోరాటాలు సాగించమని మార్పును కోరే, న్యాయాన్ని కోరే, ప్రజాస్వామిక, విప్లవకర వ్యక్తులూ, సంస్థలకు జన్ అభియాన్-బీహార్ పిలుపునిస్తున్నది.

జనముక్తి సంఘర్ష్‌వాహిని, ఎంసిపిఐ (యు), జన్‌వాదిమజ్దూర్ కిసాన్‌సభ, సర్వహరా జనమోర్చా, సిపిఐ(ఎం.ఎల్), జన ప్రతిరోధ్ సంఘర్ష్‌మంచ్, కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా, సమాజ్‌వాది జనపరిషద్, జనవాది లోక్‌మోర్చా, సిపిఐ(ఎం.ఎల్) ఎన్‌డి, సిపిఐ (ఎం.ఎల్)భాయిజీ, భాగస్తులుగా వున్న జన్ అభియాన్-బీహార్ 2014 జనవరి 25న పాట్నాలోని భగత్‌సింగ్‌చౌక్, గాంధీ మైదాన్‌లో బహిరంగసభ జరిపింది. అంతకుముందు నగరంలో ప్రదర్శన నిర్వహించింది. జనవరి 26, 27 తేదీలలో హైకోర్టు తీర్పులపై సదస్సు నిర్వహించింది. 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు అమరుల స్మృతి సమావేశాన్ని నిర్వహించింది. ఈ మూడురోజుల సమావేశాలు, సదస్సులలో వక్తలు బీహారులోని దళిత బలహీన వర్గాలపై దాడులను ఖండించారు. అధికార, న్యాయవ్యవస్థల వర్గపక్షపాత వైఖరిని నిరసించారు; దోపిడి వ్యవస్థ మార్పుకొరకు సంఘటిత పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ✸

**Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**
**and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2**
**Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**